CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 114 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 30 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :114 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 30 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఒకేసారి 52 ఉపగ్రహాలను ప్రయోగించిన రష్యా

- నింగిలోకి దూసుకెళ్లిన సోయుజ్-2.1ఎ రాకెట్
- యూఏఈ కోసం ప్రత్యేక విద్యా ఉపగ్రహం ప్రయోగం
- భూమిని పర్యవేక్షించేందుకు రెండు కీలక శాటిలైట్లు
- నౌకల కదలికలను గుర్తించేందుకు వ్యవస్థ విస్తరణ



పెన్ పవర్ డెస్క్:రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ మరో భారీ ప్రయో గాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. సోమవారం వోస్టోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి సోయుజ్-2.1ఎ వాహకనౌక ద్వారా ఒకేసారి 52 ఉపగ్రహాలను విజయవంతంగా

వివరాలు 2లో..



# ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం...

- ప్రజాభీష్టం మేరకు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు క్యాబినెట్ ఆమోదం
- మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు నిర్ణయం
- అన్నమయ్య జిల్లా పేరు యథాతథం, జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు
- మొత్తం 24 కీలక అంశాలపై చర్చించి ఆమోదించిన మంత్రివర్గం
- జనవరి 1 నుంచి కొత్త మార్పులు అమల్లోకి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్ర బాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేసినట్లు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల స్వరూపాన్ని మార్పులు, చేర్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని వివరించారు. సమావేశం అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ, ప్రజాభీష్టం మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మార్పులు జరిగాయని, 9 జిల్లాలను యథాతథంగా కొనసాగించనున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ప్రాంతాలను కలిపి ఒక మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. అలాగే, బనగానపల్లె, అడ్డరోడ్డును కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయనున్నారు. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉన్నప్పటికీ, జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తున్నట్లు ప్రకటించారు. పెనుగొండ పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది.గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత, ప్రజాభిప్రాయం లేకుండా జిల్లాల విభజన చేపట్టిందని, దానివల్ల తలెత్తిన సమస్యలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ విమర్శించారు. పారదర్శకంగా వ్యవహరించి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదన్నారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు, రాయచోటిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అనగాని తెలిపారు.మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలకు పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి పూర్తి సహకారం అందుతోందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలా కాకుండా, పథకాలకు మహనీయుల పేర్లు పెడుతున్నామని, ఈ అంశంపై కూడా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పాటు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం, విశాఖపట్నంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు వంటి ఇతర కీలక నిర్ణయాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలతో పరిపాలన ప్రజలకు మరింత చేరువ అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఏపీలో నేరాలు బాగా తగ్గాయి

### డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

పోలీసు శాఖ ఎంతో పురోగతి సాధించిందన్న డీజీపీ

పోలీసింగ్ వ్యవస్థను ఆధునికంగా మారుస్తున్నామని వెల్లడి

మావోల కార్యకలాపాలను కూడా కట్టడి చేస్తున్నామన్న డీజీపీ



పెన్ పవర్ డెస్క్:గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. 2025 సంవత్సరానికి సంబంధించి పోలీసుల పనితీరుపై రూపొందించిన ప్రత్యేక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ మంచి పురోగతి సాధించిందని తెలిపారు.ప్రత్యేకంగా మహిళల భద్రత విషయంలో పోలీసుల చర్యలు ఫలితాలు ఇచ్చాయని డీజీపీ చెప్పారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో, వేధింపుల కేసులను వేగంగా పరిష్కరించడంలో పోలీసులు మరింత

వివరాలు 2లో..

## పాకిస్థాన్ లో కొత్త టెర్రరిస్ట్ లీడర్..

### హఫీజ్, మసూద్ పనికిరారని భావిస్తున్న పాక్ ప్రభుత్వం

- ముఖాలు మార్చుకుంటున్న పాకిస్థాన్ టెర్రరిజం
- తెరపైకి కొత్త ఉగ్ర నేత యాకూబ్ షేక్
- యాకూబ్ ను 2012లోనే ఉగ్రవాదిగా గుర్తించిన అమెరికా



పెన్ పవర్ డెస్క్:భారత్‌పై ఉగ్రదాడుల పన్నాగాలకు వేదికగా మారిన పాకిస్థాన్... పేర్లు మారుస్తూ, ముఖాలు మార్చుకుం టూ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తూనే ఉంది.'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులు కొంత మారినట్టు కనిపించినా, వాస్తవం మాత్రం మరోలా ఉంది. ఒకప్పుడు భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులుగా ఉన్న హఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి వాళ్లు ఒక్కసారిగా

వివరాలు 2లో..

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు...

# 15 మంది సైనికుల మృతి


- బలూచిస్థాన్‌లో భీకర దాడులు
- పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్ఏ, బీఎల్ఎఫ్, బీఆర్జీ సంస్థలు
- సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి
- బలూచిస్థాన్ స్వాతంత్ర్యం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు



వివరాలు 2లో..

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

- అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా
- బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం
- అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబా టుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల

వివరాలు 2లో..

## ఏపీ ప్రభుత్వ సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు

- ప్రకృతి వైద్య సలహాదారుగా సత్యనారాయణ రాజు నియామకం
- ప్రభుత్వ సలహాదారుడిగా పోచంపల్లి శ్రీధర్ రావు
- రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్న మంతెన, శ్రీధర్ రావు



పెన్ పవర్ డెస్క్:ప్రకృతి వైద్య రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేసింది. ఇకపై ఏపీలో ప్రకృతి వైద్య విధానాల ప్రోత్సాహం, ప్రజల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య విధానాల రూపకల్పనలో డాక్టర్ మంతెన ప్రభుత్వానికి సలహాలు అందించనున్నారు.మంతెన సత్యనారాయణ రాజు గత కొన్ని దశాబ్దాలుగా ప్రకృతి వైద్యాన్ని ప్రజల జీవితాలకు

వివరాలు 2లో..

## వరల్డ్ ర్యాపిడ్ చెస్‌లో మెరిసిన తెలుగు తేజాలు..

### హంపి, అర్జున్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు

- వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు
- కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసిలకు సీఎం చంద్రబాబు అభినందనలు
- విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయుడిగా అర్జున్
- హంపికి పలువురు ఏపీ మంత్రులు, అర్జున్‌కు బండి సంజయ్ ప్రశంసలు

వివరాలు 2లో..



## ఐబొమ్మ రవి కేసులో వెలుగులోకి వచ్చిన మరో కోణం!

- ఐబొమ్మ రవి కేసులో దర్యాప్తు మరింత ముమ్మరం
- ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసిన రవి
- బెంగళూరులో ఉన్న ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించిన పోలీసులు




పెన్ పవర్ డెస్క్:సినీ పరిశ్ర మను కుదిపేసిన ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో దర్యాప్తు రోజురో జుకూ మరింత లోతుగా వెళ్తోంది. ఐబొమ్మ నిర్వాహ కుడు

వివరాలు 2లో..

## అమెరికా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ యువతుల మృతి

- కాలిఫోర్నియా రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం
- కడియాల భావన, పుల్లఖండు మేఘన దుర్మరణం
- మృతుల స్వస్థలం మహబూబ్ నగర్ జిల్లా గార్ల మండలం


పెన్ పవర్ డెస్క్: అమెరి కాలో ఘోర విషాదం చోటు చేసుకుంది. కాలిఫో ర్నియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగా ణకు చెందిన ఇద్దరు యువ తులు దుర్మరణం చెందారు.



వివరాలు 2లో..

## రిటైర్మెంట్ హోమ్ లో మంటలు.. ఇండోనేసియాలో 16 మంది వృద్ధుల మృతి

- మరో 15 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- బాధితులకు మనాడోలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స
- నార్త్ సులవేసి ప్రావిన్స్ లో విషాదం



పెన్ పవర్ డెస్క్:ఇండోనేషియాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. నార్త్ సులవేసి ప్రావిన్స్ లోని ఓ రిటైర్మెంట్ హోమ్ లో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడడంతో 16 మంది వృద్ధులు సజీవదహనమ య్యారు. సోమవారం నార్త్ సులవేసి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మనాడోలోని ఓ రిటైర్మెంట్ హోమ్ లో ఆదివారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఒంటరి మహిళలకు సాధికారత ఎప్పుడు

భారతీయ సమాజంలో భర్తను కోల్పోయిన మహిళలు, వివాహం కాని మహిళలు, విడాకులు పొందిన లేదా విడిపోయిన మహిళలు, వదిలివేయబడిన మహిళలను చారిత్రకంగా అశుభంగా భావించే దురాచారం బలంగా వేళ్లూనుకుంది. పితృస్వామ్య వ్యవస్థలో మహిళ సామాజిక గుర్తింపు ప్రధానంగా ఆమె వివాహ స్థితితోనే ముడిపడి ఉండటమే ఈ భావనకు మూలం. దీని ఫలితంగా ఒంటరి మహిళలు సామాజిక, ధార్మిక కార్యక్రమాల నుంచి బహిష్కరణకు గురవుతూ, వారి వేషధారణ, ప్రవర్తన, జీవనశైలిపై అనవసర ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. సతీసహగమనం వంటి అమానవీయ ఆచారాలు నిషేధించబడినప్పటికీ, వివక్ష మాత్రం రోజువారీ జీవితంలో సూక్ష్మంగా కానీ బలంగా కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం 2014లో నిర్వహించిన కుటుంబ సర్వే ప్రకారం, రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది ఒంటరి మహిళలు ఉన్నారు. కొత్త పథకాల నిర్వచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్లు, పట్టణాల్లో 35 ఏళ్లు దాటిన వివాహం కాని మహిళలను కూడా కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. అయినప్పటికీ, ఇది ప్రజా విధానాలు, అభివృద్ధి చర్చల్లో తరచూ నిర్లక్ష్యం చేయబడుతున్న పెద్ద సామాజిక వర్గం. ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మూలాలు పితృస్వామ్య సామాజిక నిర్మాణంలోనే ఉన్నాయి. మహిళ విలువను ఆమె భర్తతో ఉన్న సంబంధం ఆధారంగా కొలిచే పరిస్థితుల్లో, ఆ సంబంధానికి బయట ఉన్న మహిళలను సమాజం సాధారణానికి భిన్నంగా చూస్తుంది. దీని వల్ల వనరులపై హక్కులు తగ్గుతాయి, ఆస్తి, న్యాయ హక్కులు బలహీనపడతాయి. ఆర్థిక అసురక్షితత, సామాజిక ఒంటరితనం, మానసిక ఒత్తిడి ఒకదానికొకటి బలపరుస్తూ వీరి జీవితాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్ర చరిత్రలో, ఒంటరి మహిళలు ఇప్పటికీ వినిపించని స్వరాలుగానే ఉన్నారు. చాలామంది భద్రతలేని, తక్కువ జీతాల అసంఘటిత ఉపాధులకే పరిమితమవుతుండగా, కుటుంబ సంరక్షణ బాధ్యతలు మొత్తం వారి మీదే పడుతున్నాయి. స్థిర ఆదాయం లేకపోవడం వల్ల పేదరికం నుంచి బయటపడడం కష్టమవుతోంది.

అవసరమైన పత్రాలు, సరైన అవగాహన లేకపోవడం, సామాజిక వివక్ష, వారి తరపున మాట్లాడే వ్యక్తి లేకపోవడం వంటి కారణాలతో పెన్షన్‌లు, ఆరోగ్య సేవలు, నివాస సదుపాయాలు వంటి ప్రభుత్వ ప్రాథమిక సంక్షేమ సేవలకే పొందడమనేది కూడా పెద్ద సవాలుగా మారుతోంది. ఒంటరి మహిళల గౌరవాన్ని కాపాడాలంటే కేవలం ఆర్థిక సహాయం సరిపోదు. సమాజపు దృక్పథంలో మార్పు రావలిసిన అవసరం ఉంది. ఈ వాస్తవాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన చర్యలు చేపట్టింది. 2025లో ఆసరా పథకం క్రింద ఒంటరి మహిళల పెన్షన్‌ను నెలకు రూ. 4,000కి పెంచింది. ఇది వారికి కీలక ఆదాయ సహాయంగా నిలుస్తోంది. అంతేకాకుండా, స్వావలంబనను ప్రోత్సహించే దిశగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా అర్హులైన మైనారిటీ మహిళలకు ఒకసారి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇది చిన్న వ్యాపారాలు, సూక్ష్మ ఉపాధులకు దోహదపడే చర్యగా మారింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం అవుతూ, ఒంటరి మహిళలకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవగాహన, మార్కెట్ అనుసంధానాన్ని అందిస్తున్నాయి. ఆరోగ్య పథకాలు, పోషకాహార కార్యక్రమాలు, షీ- టీమ్ వంటి భద్రతా చర్యలు వారి గౌరవం, భద్రతపట్ల ప్రభుత్వ నిబద్ధతను చూపిస్తున్నాయి. అయితే పెన్షన్‌లు తాత్కాలిక ఉపశమనానికే పరిమితమవుతుండగా, అవగాహన లోపం, సామాజిక వివక్ష వల్ల చాలామంది లబ్ధి పొందలేకపోతున్నారు. చిన్న వ్యాపారాల స్థిరత్వానికి నిరంతర మార్గదర్శకత్వం, మార్కెట్ మద్దతు అవసరంబీ అలాగే ఒంటరి మహిళల మానసిక ఆరోగ్యానికి ఇంకా తగిన ప్రాధాన్యం లభించడం లేదు. ఒంటరి మహిళల సాధికారత అనేది కేవలం సంక్షేమ అంశం కాదుబీ అది అభివృద్ధికి కీలక అంశం. ఆర్థికంగా స్వతంత్రమైన మహిళ తన కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తుంది, పిల్లల భవిష్యత్తులో పెట్టుబడి పెడుతుంది, సమాజాన్ని బలోపేతం చేస్తుంది. ఆమె సాధికారత రాష్ట్ర ఆర్థిక, సామాజిక నిర్మాణంపై బహుళ ప్రభావాన్ని చూపుతుంది. సమగ్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తున్న తెలంగాణ రాష్ట్రం, ఒంటరి మహిళల కోసం ప్రత్యేకమైన, సమగ్ర విధాన రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక భద్రత, ఆర్థిక సాధికారత, న్యాయ పరిరక్షణ, కౌన్సెలింగ్ సేవలు, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, వివక్షను ఎదుర్కొనే చర్యలు అన్నీ ఒకే చట్రంలో ఉండాలి. చవకైన నివాసాలు, సురక్షిత ప్రజా స్థలాలు, అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, లక్ష్యబద్ధమైన ఉపాధి కార్యక్రమాలు ఈ విధానానికి పునాది కావాలి. ఒంటరి మహిళల సాధికారత ఒక భిక్షకాదు అది వారి హక్కు, న్యాయం, సమానత్వానికి సంబంధించిన అంశం.తెలంగాణ అభివృద్ధి నిజంగా అర్థవంతంగా మారాలంటే, ఒంటరిగా నిలబడాల్సిన పరిస్థితుల్లో ఉన్న ఒక్క మహిళ కూడా వెనుకబడకూడదు.

# వరల్డ్ ర్యాపిడ్ చెస్‌లో మెరిసిన తెలుగు తేజాలు..

ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన తెలుగు క్రీడాకారులు కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసిలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా ఆయన ఇద్దరు క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు.కోనేరు హంపిని ఉద్దేశించి చంద్రబాబు స్పందిస్తూ, “ఒక్క ఫలితంతో ఛాంపియన్లను అంచనా వేయలేం. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే ధైర్యమే వారిని నిలబెడుతుంది. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం మీ నైపుణ్యానికి నిదర్శనం. మీ ప్రయాణం, నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది“ అని పేర్కొన్నారు.అదేవిధంగా అర్జున్ ఎరిగైసిని కూడా ఆయన కొనియాడారు. “పురుషుల్లో గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచారు. తెలంగాణ బిడ్డ అయిన అర్జున్, భారత చెస్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేర్చారు“ అని చంద్రబాబు అన్నారు.

మరోవైపు, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి వి. అనిత, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ ఎ. రవి నాయుడు కూడా హంపికి శుభాకాంక్షలు తెలిపారు. హంపి ఇప్పటికే ఈ ఛాంపియన్‌షిప్‌లో

ఐదు పతకాలు సాధించిందని, ఆమె మహిళా క్రీడాకారులందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా అర్జున్‌ను అభినందించారు. తెలంగాణ గడ్డకు గర్వకారణంగా నిలిచిన అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హంపిని కూడా అభినందించిన బండి సంజయ్, ఆమె దేశం గర్వపడేలా చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు...

# 15 మంది సైనికుల మృతి

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని వారాలుగా బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు సోమవారం స్థానిక మీడియా వెల్లడించింది. డిసెంబర్ 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయండ్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 25న చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు ‘ది బలూచిస్థాన్ పోస్ట్’ పేర్కొంది.

మరోవైపు, డిసెంబర్ 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా

వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు. నసీరాబాద్ జిల్లాలో శనివారం రాత్రి పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం వచ్చేవరకు ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది.

# పాకిస్థాన్ లో కొత్త టెర్రరిస్ట్ లీడర్..

- మొదటి పేజి తరువాయి
వార్తల నుంచి మాయమయ్యారు. వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుకు తెచ్చిందన్న ఆరోపణలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వస్తున్నాయి.ఆ కొత్త ఉగ్ర నేత పేరు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్. లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు, ఇప్పుడు స్వతంత్రంగా తనకంటూ ఓ కొత్త సంస్థను నిర్మించుకున్నాడు. ఆ సంస్థ పేరు సెంట్రల్ ముస్లిం లీగ్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. అంతే కాదు, దీనికి పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**యాకూబ్ షేక్ నేపథ్యం**

1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అయితే క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. అప్పట్లో అతడు లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు, జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి.

2017లో దిఫా-ఏ-పాకిస్థాన్ కౌన్సిల్ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు. అయినా రాజకీయాల్ని, ఉగ్రవాదాన్ని కలిపి నడిపే ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. 2025 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో, యాకూబ్ తాలిబాన్ పాలనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశాడు. ఇదే అంశం పాక్ సైన్యానికి అతడిని దగ్గర చేసింది. అప్పటి నుంచి యాకూబ్‌కు సైన్యం అండగా నిలుస్తోందన్న ప్రచారం మొదలైంది.

ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 14 మంది మరణించారు. హాఫీజ్ సయీద్‌కు చెందిన రహస్య స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరూ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారు పాక్ సైన్యం నిఘాలోనే భద్రంగా ఉన్నారని సమాచారం. ఇదే సమయంలో పాకిస్థాన్ దేశంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్, బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రసంస్థలు సైన్యానికి పెద్ద సవాలుగా మారాయి. వీటిని అణచివేయడంలో పాక్ సైన్యం విఫలమవుతోంది.

ఈ పరిస్థితుల్లోనే పాకిస్థాన్ మరోసారి పాత పద్ధతికే వెళ్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత ఉగ్రనేతలు అయిన హాఫీజ్, మసూద్ ఇక పనికిరారని భావించి, వారి స్థానంలో కొత్త ముఖాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే ఖారీ యాకూబ్ షేక్ అని అంటున్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాల ముసుగులో దాచిపెట్టి, ప్రపంచాన్ని మభ్యపెట్టే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోందన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

# ఐబొమ్మ రవి కేసులో వెలుగులోకి వచ్చిన మరో కోణం!

- మొదటి పేజి తరువాయి
రవిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఈ విచారణలో వెలుగుచూస్తున్న విషయాలు దర్యాప్తు అధికారులను కూడా షాక్‌కు గురిచేస్తున్నాయి. తాజాగా ఈ కేసులో మరో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. రవి కేవలం పైరసీ వరకే పరిమితం కాకుండా, ఇతరుల గుర్తింపు పత్రాలను దొంగిలించి భారీ అక్రమాలకు పాల్పడ్డాడన్న అనుమానాలు బలపడుతున్నాయి.గతంలో పోలీసుల ముందు రవి ఇచ్చిన వాంగ్మూలంలో... ‘ప్రహ్లాద్ వెల్లేల’ అనే వ్యక్తి తన రూమ్‌మేట్ అని, ఐబొమ్మ నిర్వహణలో అతడికి కూడా పాత్ర ఉందని చెప్పాడు. అయితే విచారణ ముందుకు సాగిన కొద్దీ, రవి చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనని తేలింది. వాస్తవానికి ప్రహ్లాద్‌కు ఏమాత్రం తెలియకుండానే అతడి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి కీలక డాక్యుమెంట్లను రవి దొంగలించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ దొంగిలించిన పత్రాలతో ప్రహ్లాద్ పేరుపై నకిలీ పత్రాలు సృష్టించి, బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించడం, వెబ్‌సైట్ కార్యకలాపాలకు ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో నిజాలను వెలికితీసేందుకు బెంగళూరులో నివసిస్తున్న ప్రహ్లాద్‌ను ప్రత్యేకంగా పిలిపించారు.రవి ఎదుటే ప్రహ్లాద్‌ను కూర్చోబెట్టి పోలీసులు విచారణ చేపట్టగా, అతడు ఇచ్చిన స్టేట్‌మెంట్ అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు రవి ఎవరో తెలియదని, తామిద్దరం ఎప్పుడూ రూమ్‌మేట్స్‌గా ఉండలేదని ప్రహ్లాద్ స్పష్టంగా చెప్పాడు. తన పేరుతో పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వాడుతున్నారన్న విషయం తెలిసి తీవ్రంగా కలత చెందానని పోలీసులకు వివరించాడు. తన డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు కూడా చేశాడు.

ఈ పరిణామాలతో ఇమంది రవి చేసిన నేరాల జాబితా మరింత పెద్దదిగా మారుతోంది. పైరసీతో పాటు ఐడెంటిటీ థెఫ్ట్, ఫోర్జరీ, మోసాలు వంటి తీవ్రమైన ఆరోపణలు అతడిపై నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే తరహాలో ఇంకెంతమంది అమాయకుల డాక్యుమెంట్లు దుర్వినియోగం అయ్యాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ఒకేసారి 52 ఉపగ్రహాలను ప్రయోగించిన రష్యా

- మొదటి పేజి తరువాయి
కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కోసం రూపొందించిన ఒక విద్యా ఉపగ్రహం కూడా ఉండటం గమనార్హం.ఈ ప్రయోగంలో భాగంగా యూఏఈకి చెందిన QMR`KWT`2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. రష్యా, యూఏఈ, కువైట్ మధ్య సహకారాన్ని పెంచడంతో పాటు అరబ్ దేశాల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించడం, అమెచ్యూర్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ సేవలు అందించడం ఈ ఉపగ్రహం ముఖ్య ఉద్దేశమని స్పుత్నిక్స్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు.వీటితో పాటు సముద్రంలో నౌకల కదలికలను గుర్తించేందుకు రష్యా తన శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ వ్యవస్థను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా పదుల సంఖ్యలో క్యూబ్‌శాట్ 3ఖ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీని పరీక్షించేందుకు సిట్రో-టీడీ ఉపగ్రహాలను కూడా ప్రయోగించినట్లు కంపెనీ పేర్కొంది.ఈ ప్రయోగంలో ఏఐఎస్‌టీ-2టీ సిరీస్‌కు చెందిన రెండు ఉపగ్రహాలు ప్రధానమైనవి. ఇవి భూమి ఉపరితలాన్ని ఫోటోలు తీసి,

డిజిటల్ మ్యాప్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. అగ్నిప్రమాదాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను పర్యవేక్షించేందుకు కూడా ఉపయోగపడతాయి. కనీసం ఐదేళ్ల పాటు పనిచేసేలా ఈ ఉపగ్రహాలను రూపొందించారు.

# ఏపీ ప్రభుత్వ సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు

- మొదటి పేజి తరువాయి
దగ్గర చేసే ప్రయత్నంలో ముందుండి పనిచేస్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఆహార నియమాలు, జీవనశైలి మార్పుల ద్వారా అనేక రుగ్మతలకు ఉపశమన మార్గాలు చూపించారు. విజయవాడ సమీపంలోని ఉండవల్లి కరకట్టపై ఏర్పాటు చేసిన ‘ప్రకృతి చికిత్సాలయం’ ద్వారా వేలాది మందికి సేవలందించారు. అలాగే విజయవాడ, నరసాపురం ప్రాంతాల్లో కూడా ఆయన ఆధ్వర్యంలో ఆరోగ్యాలయం కేంద్రాలు పనిచేస్తూ ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నాయి. టీవీ చానళ్లు, యూట్యూబ్ చానళ్ల వంటి వివిధ మాధ్యమాల ద్వారా కూడా ఆయన ప్రకృతి వైద్య విధానాన్ని విస్తృతం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల్లో ప్రకృతి వైద్యానికి ప్రత్యేక స్థానం కల్పించాలనే లక్ష్యంతోనే ఈ నియామకం చేసినట్లు సమాచారం. ఆధునిక వైద్యం తో పాటు ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను సమన్వయం చేస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేయాలన్న దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**కార్టూనిస్ట్ శ్రీధర్ కు కూడా కీలక పదవి**

ఇదే సమయంలో, మాస్ కమ్యూనికేషన్ రంగంలో అనుభవం ఉన్న పోచంపల్లి శ్రీధర్ రావును కూడా ఏపీ ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. సమాచార ప్రసారం, ప్రజలతో ప్రభుత్వ కార్యక్రమాల అనుసంధానం వంటి అంశాల్లో ఆయన ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనున్నారు. పోచంపల్లి శ్రీధర్ రావు అంటే ఎవరో కాదు... ప్రముఖ కార్టూనిస్ట్ గా ఆయన పేరుప్రఖ్యాతులు అందుకున్నారు. ఈనాడు దినపత్రికకు సుదీర్ఘకాలం సేవలు అందించారు.మంతెన సత్యనారాయణ రాజు, పోచంపల్లి శ్రీధర్ రావు ఇద్దరూ రెండేళ్ల పాటు ఈ సలహాదారు పదవుల్లో కొనసాగనున్నారు. ప్రజారోగ్యం, సమాచార వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకాలు దోహదపడతాయని భావిస్తున్నారు.

# బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

- మొదటి పేజి తరువాయి
సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు.ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు.బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.

# రిటైర్మెంట్ హోమ్ లో మంటలు.. ఇండోనేసియాలో 16 మంది వృద్ధుల మృతి

- మొదటి పేజి తరువాయి
చుట్టుపక్కల వారు సమాచారం అందించడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మంటల ధాటికి అప్పటికే 16 మంది వృద్ధులు మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది హోమ్ లోని 15 మందిని కాపాడి ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను గుర్తించి బంధువులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తేలిందని, పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు.

# ఏపీలో నేరాలు బాగా తగ్గాయి

- మొదటి పేజి తరువాయి
అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాగే మత్తు పదార్థాల రవాణాపై దృష్టి సారించి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను కట్టడి చేయడంలో కూడా గణనీయమైన విజయాలు సాధించామని చెప్పారు. దొంగిలించిన మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో సాంకేతికతను ఉపయోగించి వేల సంఖ్యలో ఫోన్లను బాధితులకు తిరిగి అందించామని వివరించారు.రాబోయే రోజుల్లో పోలీసింగ్ వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ స్పష్టం చేశారు. వచ్చే పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉండాలి? ఎలాంటి మార్పులు అవసరం? సాంకేతికతను ఎలా వినియోగించాలి? అనే అంశాలపై రెండు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వర్క్‌షాప్ జరగనుందని, ఇందులో పోలీసు విధుల్లో మార్పులు, ఆధునిక టెక్నాలజీ వినియోగంపై లోతైన చర్చలు జరుగుతాయని చెప్పారు. ప్రజలు నిజంగా కొత్త పోలీసింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా చూడగలిగేలా ఈ కార్యక్రమం ఉంటుందని అన్నారు.

చట్టం ముందు అందరూ సమానమేనని డీజీపీ మరోసారి స్పష్టం చేశారు. ఎవరు చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినా, ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగిస్తూ మావోయిస్టు కార్యకలాపాలను కూడా కట్టడి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేయడం ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.సైబర్ నేరాలపై కూడా డీజీపీ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాల వెనుక చైనా కేంద్రంగా పనిచేస్తున్న పెద్ద ముఠాలు ఉన్నాయని చెప్పారు. మోసం జరిగిన వెంటనే బాధితుల డబ్బు విదేశాలకు తరలిపోతుండటంతో ఆ మొత్తాన్ని తిరిగి రాబట్టడం చాలా కష్టంగా మారుతోందని తెలిపారు. అందుకే ప్రజలు ఎలాంటి ఆన్‌లైన్ లావాదేవీల్లోనైనా అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మొత్తంగా మహిళల భద్రత, మత్తు పదార్థాల నియంత్రణ, సైబర్ నేరాల అడ్డుకట్ట, నేరాల నియంత్రణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ప్రజల సహకారం ఉంటే రాష్ట్రాన్ని మరింత సురక్షితంగా మార్చగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.


# అమెరికా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ యువతుల మృతి

- మొదటి పేజి తరువాయి
మృతులను మహబూబ్ నగర్ జిల్లా గార్ల మండలానికి చెందిన కడియాల భావన (24), పుల్లఖండు మేఘన (24)గా గుర్తించారు. ఉన్నత విద్య, ఉద్యోగాల నిమిత్తం వారు అమెరికాకు వెళ్లారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. అక్కడి స్థానిక అధికారులు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగపోయారు. వారి రోదన స్థానికులను కలచివేస్తోంది.

## చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 29**

ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. కారుణ్య నియామకం కోటాలో ఉద్యోగాలు పొందిన 8 మందికి, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద పరిహారంలో భాగంగా ఉద్యోగాలు పొందిన ఇద్దరికి సోమవారం గ్రీవెన్స్ హాలులో ఆయన నియామక పత్రాలు అందించారు. ప్రభుత్వ సర్వీసులోకి వస్తున్నందుకు అభినందిస్తూ, విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.




పెన్ పవర్
ప్రకాశం

# కేబినెట్ ఆమోదంపై హర్షం తెలిపిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**కందుకూరుపై మాట నిలబెట్టుకున్న కూటమి పెద్దలకు ధన్యవాదాలు**

**జనవరి 4న కందుకూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం**

**నూతన సంవత్సర వేడుకలను క్రమశిక్షణతో జరుపుకోండి**

**ఇక నిరంతరం యజ్ఞంలా కందుకూరు అభివృద్ధి**

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**







**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29:**

కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటంపై కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా, కందుకూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, పునర్విభజన కమిటీ సభ్యులకు కందుకూరు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలు, ఆశలకు అనుగుణంగా తాము చేసిన పోరాటం ఫలించిందని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కందుకూరు చరిత్రలో ఇది మరిచిపోలేని అధ్యాయమని తెలిపారు. డిసెంబర్ 31న కందుకూరు నియోజకవర్గంను ప్రకాశం జిల్లాలో కలుపుతూ గెజిట్ విడుదలవుతుందని ఎమ్మెల్యే వివరించారు. కందుకూరు నియోజవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని, అదే సమయంలో తోటివారికి ఇబ్బంది కలగకుండా, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. కందుకూరు పట్టణంలో 5.43 కోట్ల రూపాయలతో రోడ్ల వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. గుడ్లూరు రోడ్డు, సింగరాయకొండ రోడ్డులో త్వరలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తర్వాత కోవూరు రోడ్డు, కనిగిరి రోడ్డులో ఈ పనులు మొదలవుతాయన్నారు. కందుకూరు పట్టణంలో అభివృద్ధి పనుల కోసం మరో 5 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపగా, త్వరలో నిధులు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. తన చిన్న కుమారుడు సందీప్ పుట్టినరోజు సందర్భంగా జనవరి 4వ తేదీన కందుకూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. గుంటూరు శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందిస్తామని చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పాల్గొన్నారు.

# రుణాలు మంజూరులో లక్ష్యాలు పూర్తి చేయాలి

**- బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశం**




**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ డిసెంబర్ 29**

జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రజలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజబాబు బ్యాంకర్లను లను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయని లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన చెప్పారు. బ్యాంకర్లు అర్హులైన లబ్ధిదారు లందరికీ బ్యాంకు రుణాలు అందజేయాలని ఆయన సూచించారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలలో 25వేల45 కోట్ల రూపాయల రుణాలు మంజూరు లక్ష్యంకాగా ఇప్పటి వరకు 16వేల505 కోట్ల రూపాయల రుణాలను బ్యాంకర్లు మంజూరు చేసారని నూరు శాతం రుణాలు మంజూరుచేసి లక్ష్యాలను సాధించాలని ఆయన బ్యాంకర్లకు చెప్పారు. బ్యాంకు రుణాలు మంజూరు చేయడానికి లబ్ధిదారులతో బ్యాంకర్లతో కలిపి వర్క్ షాప్ లను ఏర్పాటుచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి గేదెల రుణాల మంజూరు కొరకు బ్యాంకర్లు పంపడం జరిగిందని బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని బ్యాంకర్లు స్పందించి వెంటనే పాడి గేదెల రుణాలను మంజూరు చేయాలని ఆయన చెప్పారు. జిల్లాలో అర్హత గల లబ్ధిదారులకు పాడి గేదెల కొనుగోలు పథకం క్రింద రుణాలు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్లకు చెప్పారు. జిల్లాలో పీ.ఎం.ఇ.జీ.పి పథకం క్రింద పరిశ్రమల స్థాపన కొరకు 102 దరఖాస్తులు పరిశ్రమ శాఖ నుండి రుణాల మంజూరు కొరకు బ్యాంకులకు పంపించడం జరిగిందని పరిశీలించి వెంటనే మంజూరు చేయాలని బ్యాంకర్ల ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అగ్రికల్చర్ డిప్లమో, ఇంజనీరింగ్ పట్టభద్రు లకు శిక్షణ ఇచ్చి అగ్రి బిజినెస్ కొరకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అర్హత గల వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ప్రకాశంజిల్లాలో ఎక్కువ ప్రాంతం ఫ్లోరైడ్ ప్రభావం ఉందని ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడుతున్నారని సామాజిక బాధ్యతతో బ్యాంకర్లు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. వన్ ఇన్స్టిట్యూషన్ వన్ ఆఫీసర్ అనే కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టడం జరిగిందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని ఎస్.సి, ఎస్.టి, బీ.సీ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస రావు,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్, ఆర్.బి.ఐ ఎ.జీ.ఎం రోహిత్ అగర్వాల్, నాబార్డ్ ఎ.జి.యం రవికుమార్, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పొదిలి ఎస్సై వేమనను విధులనుండి తొలగించాలి

**- ఆర్యవైశ్య సంఘాల డిమాండ్ - జిల్లా కలెక్టర్..**

**- జిల్లా ఎస్పీలను కలిసిన కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు**

**- న్యాయం చేస్తామని బాధితులకు ఎస్పీ హామీ...**





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 29**

పొదిలిలో ఎరువుల వ్యాపారం చేస్తున్న యాదాల వెంకట అవినాష్ పై పొదిలి ఎస్ఐ వేమన అకారణంగా దాడి చేయడం పై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎస్సై ను విధులు నుంచి తొలగించాలని ఆర్యవైశ్య సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్యవైశ్యులు ఒంగోలు లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. పొదిలి పట్టణం నందు ఎరువుల దుకాణం వద్ద లారీని నిలిపి ఉంచిన కారణంతో దుకాణ యజమాని అయిన యాదాల వెంకట అవినాష్ పైన ఎస్ఐ వేమన ప్రవర్తించిన తీరును నిరసిస్తూ పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు రోడ్డుఎక్కి నిరసన తెలిపారు. పొదిలి పట్టణం ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన యదాల కోటేశ్వర రావు వృత్తి రీత్యా గతకొంత కాలంగా ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. అయితే ఈ నెల 24వ తేదీన దుకాణం నందు ఎరువు బస్తాలను దించాలని తన కుమారుడు వెంకట అవినాష్ కు తండ్రి కోటేశ్వర రావు తెలపడంతో దుకాణంలో ఎరువు బస్తాలను దింపుతున్న తరణంలో విధుల్లో ఉన్న ఎస్ఐ వేమన వచ్చి తనపై దాడి చేశారని బాధితుడు అవినాష్ ఆరోపించారు. పోలీసు స్టేషన్ కు తరలించి తనపై విచక్షణ రహితంగా ఎస్ఐ దాడి చేశారని బాధితుడు తెలిపాడు. అడ్డు వచ్చిన తన తండ్రిపైన కూడా వేమన దురుసుగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ తీరును నిరసిస్తూ ఆర్యవైశ్యులు పొదిలి పట్టణంలో స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి నిరసన తెలియజేశారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలు కు పెద్ద సంఖ్యలో చేరుకున్న ఆర్యవైశ్యులు ప్రకాశం భవనంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజబాబు ను కలసి తమ గోడును కుటుంబ సభ్యులు తోపాటు పలువురు ఆర్యవైశ్యులు వెళ్లబోసు కున్నారు. బాధితుల సమస్యను స్వయంగా విన్న కలెక్టర్ రాజబాబు ఎస్పీ కి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ పైన ఇప్పటికే చర్యలు తీసుకొని అతనిని వి.ఆర్ కు పిలిపించడం జరిగిందని ఎస్పీ కలెక్టర్ కు వివరించారు. అతనిపైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు కలెక్టర్ భరోసా ఇవ్వడంతో శాంతించిన ఆర్యవైశ్యులు అక్కడి నుంచి జిల్లా ఎస్పీని కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎస్ఐ వేమన వల్ల తమకు ప్రాణ హాని ఉందని అతని నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వెంకట అవినాష్ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆయనను విధులు నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గునుపూడి భాస్కర్, మొదుకూరి శ్రీను, పల్లపోతు వెంకటేశ్వర్లు తోపాటు ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాలకొండ హుండీ ఆదాయం రూ. 61,38,761

**వలేటివారిపాలెం, పెన్ పవర్ డిసెంబర్ 29**

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారి హుండీ లెక్కింపు కొండపై కల్యాణ మండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా 58,87,491రూపాయలు మరియు అన్నదానానికి కానుకల రూపంలో 2,51,270 రూపాయలు ఆదాయం



వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం హుండీల ద్వారా రూ .61,38,761 వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే స్వామి వారికి యుఎస్ డాలర్లు 131, సింగపూర్ డాలర్లు 2 వచ్చాయి. బంగారం-0.89 గ్రాములు, వెండి-601.గ్రాములు వచ్చింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణాధికారిగా పి. సైదమ్మ బాయి సహాయ కమీషనర్ మరియు జ్యూయలరి వెరిఫికేషన్ ఆఫీసర్ గుంటూరు దేవాదాయశాఖ అధికారి హాజరైయ్యారు.

## ఎంపీటీసీ కి ఆర్థిక సహాయం అందజేసిన దద్దాల



**పీసీపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 29**

గుంటుపల్లి ఎంపీటీసీ అరుమళ్ళ రవి ఇటీవల గుండెపోటు కారణంగా ఆపరేషన్ చేయించుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి నియోజకవర్గం వైకాపా పార్టీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం రవి ని పరామర్శించారు . అనంతరం 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేసి ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గుండె చికిత్స కు సంబందించిన వివరాలు ఆరాతీసి, ఆరోగ్యానికి సంబందించిన పలు జాగ్రత్త పాటించాలన్నారు. అనంతరం గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని తురకపల్లి గ్రామంలో వైకాపా కార్యకర్త పక్షవాతంతో బాధపడుతున్న మార్తాల శ్రీనివాస రెడ్డి ని పరామర్శించారు. ఆయన వెంట గోపవరపు బొర్రారెడ్డి,ఒకే రెడ్డి, పడుచూరి రమేష్ గౌడ్,సైకం ఏడుకొండలు రెడ్డి,కాంచని లక్ష్మణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పొదిలిలో జరిగే ధర్నా కార్యక్రమానికి తరలిన ఆర్యవైశ్యులు, జర్నలిస్టులు




**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, డిసెంబర్ 29**

పొదిలి పట్టణంలో ఇటీవల ఆర్యవైశ్యుల మీద జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో నిరసన కార్యక్రమానికి కనిగిరి నుంచి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచపూటి వెంకటేశ్వర్లు, ఏపీ శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్యుల జర్నలిస్టుల సంక్షేమ సేవాసంఘం నాయకులు చక్కా బసవేశ్వర రావు నేతృత్వంలో పొదిలికి తరలి వెళ్లారు. ఆర్యవైశ్యులపై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవటం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు బచ్చు వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, కొలిపాకుల రమేష్, రాచపూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29**

పట్టణంలోని 3 వార్డు, నల్లమల్లివారితోటలో గల సచివాలయాన్ని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. సిబ్బంది ఏ ఏ విధులకు వెళ్లారో అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సేవలు, పథకాల అమలు గురించి ఆరా తీశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కే.అనూషతో కలిసి బృందావనం ప్రాంతంలో వీధులు, డ్రైనేజీ కాలవలను పరిశీలించారు. వీధుల్లో చెత్తను ఏరోజుకారోజు తొలగించాలని అధికారులకు సూచించారు. ఖాళీ ప్లాట్లలో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించారు. ప్లాట్ల యజమానులతో మాట్లాడి పిచ్చి మొక్కలు తొలగించాలని కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు పార్టీ నాయకులు చనమాల శ్రీధర్, శ్యామ్, యన్.లక్ష్మణరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# చదువులో ఏకాగ్రత ముఖ్యం... ఎంపీడీవో

**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 29**

పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించడం ఖాయమని అధికారులు స్పష్టం చేశారు. 'వన్ ఆఫీసర్ – వన్ ఇన్స్టిట్యూషన్' కార్యక్రమంలో భాగంగా పుల్లలచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను పుల్లల చెరువు ఎంపీడీవో మరియదాస్ తనిఖీ చేశారు.పదో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక (100 డేస్ ప్లాన్)పై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల షెడ్యూల్‌ను క్రమబద్ధంగా అమలు చేస్తే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడం సాధ్యమని తెలిపారు. రోజువారీ లక్ష్యాలను నిర్ణయించుకుని చదవాలని, పాఠ్యాంశాలను విడతలవారీగా పూర్తి చేసుకుంటూ రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలసత్వానికి తావివ్వకుండా ప్రతి రోజును సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడు పదో తరగతి ఫలితాలు జీవితానికి బలమైన పునాది అవుతాయని అన్నారు.ఎంపీడీవో మధ్యాహ్న భోజనం పథకం అమలును





పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, ఆహార నాణ్యత, మెనూ అమలు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట వారితో మాట్లాడి భోజనం తయారీ విధానం, సరుకుల సరఫరా, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడుతో మధ్యాహ్న భోజనం పథకం అమలులో పాటించాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా తీసుకుంటున్న చర్యలపై సమాచారం సేకరించారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడితేనే చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, అందుకే ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వంద రోజుల ప్రణాళిక ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాలకు లేజర్ ప్రింటర్ల పంపిణీ...



**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 29**

ప్రభుత్వం సచివాలయాల బలోపేతానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా పుల్లలచెరువు మండలంలోని సచివాలయాలకు అవసరమైన లేజర్ ప్రింటర్లను ఎంపీడీవో మరియదాస్ పంపిణీ చేశారు.పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వము అందజేసిన 14 లేజర్ ప్రింటర్లను సచివాలయ సిబ్బందికి అధికారికంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియదాస్, డిప్యూటీ ఎంపీడీవో, సచివాలయం ఎంపీడీవో చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆధునిక పరికరాలను అందజేస్తోందని తెలిపారు.సేవల వేగం పెరగనుంది. ప్రతి సచివాలయంలో రోజూ పెద్ద ఎత్తున ధృవపత్రాలు, రసీదులు, ప్రభుత్వ ఉత్తర్వులు ముద్రించాల్సి వస్తుండటంతో లేజర్ ప్రింటర్ల అవసరం ఎంతో ఉందని అధికారులు అన్నారు. కొత్తగా పంపిణీ చేసిన ప్రింటర్ల ద్వారా పని భారం తగ్గడంతో పాటు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందని వివరించారు.సచివాలయ వ్యవస్థ బలోపేతం గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించాలంటే సచివాలయాల వ్యవస్థ బలోపేతం కావాలని, అందుకే ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అధికారులు తెలిపారు. సచివాలయ సిబ్బంది కూడా ఈ పరికరాలను బాధ్యతతో వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాలకు సిబ్బంది పాల్గొని ప్రింటర్లను స్వీకరించారు. లేజర్ ప్రింటర్ల పంపిణీతో మండలంలోని సచివాలయాల్లో పరిపాలనా పనులు మరింత సులభతరం కానున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

## 31ననే సామాజిక పెన్షన్లు పంపిణీ



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 29**

కొమరోలు మండలంలోని సామాజిక పెన్షన్ దారులకు 2026 జనవరి మాసానికి సంబంధించిన పెన్షన్ లను నెల 31వ తేదీననే పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా కొమరోలు ఎంపీడీవో ఎస్ సత్యం తెలిపారు. ప్రతి నెల ఒకటవ తేదీన సామాజిక పెన్షన్ దారులకు పెన్షన్లు పంపిణీ చేసేవారని ,అయితే 2026 జనవరి ఒకటవ తేదీన అన్ని వర్గాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటారని ,అందువల్ల పెన్షన్లను ఈ నెల 31వ తేదీనే పంపిణీ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బంది తనకు కేటాయించిన పెన్షన్ నిధులను ఈ నెల 30వ తేదీ న బ్యాంకుల ద్వారా డ్రా చేసుకుని, 31వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమం చేపడతారని ఆయన తెలిపారు. 26 జనవరి మాసానికి కొమరోలు మండలంలో 5,524 మంది వృద్ధాప్యపు వితంతువు వికలాంగులు శాశ్వత వికలాంగులు 5524 మందికి పెన్షన్లు పంపిణీ చేయవలసి ఉన్నదని ఆయన తెలిపారు. వారందరికీ జనవరి మాసానికి సామాజిక పెన్షన్ పంపిణీ చేయుటకు కొమరోలు మండలానికి రెండు కోట్ల ,51 లక్షల, 55 వేల, 500 రూపాయలు మంజూరయ్యాయని ఆయన చెప్పారు కావున లబ్ధిదారులు గ్రామ సచివాలయాల సిబ్బందికి తమ వంతు సహకారం అందించి పెన్షన్లు పొందాలని ఆయన కోరారు.

## పది విద్యార్థులకు ప్రేరణ తరగతులు






**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29:**

విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, వాటిని ఎలా చేరుకోవాలో తెలుసుకోవాలని ప్రేరణాత్మక వక్త సుధీర్ సంద్రా సూచించారు.ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (ఏ.పి.పి.యు.ఎస్.ఎం.ఎ) ఆధ్వర్యంలో స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాలు పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చదువులో ప్రోత్సహించడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, కష్టపడి చదవడం, ఒత్తిడిని జయించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు డిప్యూటీ డి.ఈ.ఓ పివీ నరసింహారావు, ఎం ఈ ఓ లు నాగకుమార్ శర్మ, సుబ్బారెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలపై నమ్మకం కలిగించుకొని, భయాలను అధిగమించేలా ముందుకు సాగాలన్నారు.సమయపాలన, క్రమబద్ధమైన అధ్యయన అలవాట్లను నేర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షల భయం, ఒత్తిడిని జయించడానికి మానసిక స్థైర్యాన్ని ఉపాధ్యాయులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రతికూల ఆలోచనలను తొలగించి, సానుకూలంగా ఆలోచించేలా ప్రోత్సహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామారావు, సెక్రటరీ సాయిబాబా, ట్రెజరర్ రాఘవులు, పలు పాఠశాల కరస్పాండెంట్లు మర్రెడ్డి, శ్రీను, వేణు, సోమా నాయుడు, కలగారెడ్డి, ఉలవపాడు సెయింట్ జోసెఫ్ స్కూల్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల ప్రతిభకు కలెక్టర్ ప్రశంశలు

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 29**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ఢిల్లీలో నిర్వహించిన బాలల ధైర్యాన్ని త్యాగాన్ని స్మరించుకుంటూ వీర్ బాల్ దివాస్. 20 25 వేడుకల సందర్భంగా ప్రకాశం జిల్లాలోని సీసీఐ నందు ఆశ్రయం పొందుతున్న ఆర్ఫాన్, సెమీ ఆర్ఫన్స్, బాలలకు రాష్ట్ర జిల్లాస్థాయిలో వివిధ రంగాల ప్రతిభ చూపిన వారికి జిల్లా కలెక్టర్ పి రాజబాబు సర్టిఫికెట్స్, మేమొంటు లు బాలలకు అందించారు. సోమవారం ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరని అని తెలియజేశారు. జిల్లాలో బాలల కోసం పనిచేసే సంస్థలు ఎన్జీవోస్ అన్ని శాఖల జిల్లా అధికారులు చొరవ తీసుకొని బాలల అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. బాలసదనం ఒంగోలు నందు విద్య అభ్యసించున్న వి.నికిత, కె.శిరీష 10 వ తరగతిలో 550 పై 600 పైగా మార్కులు సాధించారు. అలాగే బొమ్మరిల్లునందు విద్య




అభ్యసించున్న పదిమందికి పైగా పిల్లలు జాతీయ రాష్ట్ర లెవెల్ లో క్రీడల్లో ప్రథమ ద్వితీయ బహుమతులు పొందారు. పిల్లలందరినీ జిల్లా కలెక్టర్ , అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా.. శిశు సంక్షేమ సాధికారత అధికారిణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ (డీసీపీవో), ఔట్రీచ్ వర్కర్స్ శామ్యూల్ రాజు, సిసిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## గిద్దలూరులో వాహనాల విస్తృత తనిఖీలు!!



**గిద్దలూరు పెన్ పవర్ డిసెంబర్ 29**

గిద్దలూరు పట్టణంలో అర్బన్ సీఐ సురేష్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ జిలాని ఆధ్వర్యంలో వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా దృష్ట్యా, ప్రజారోగ్య పరిరక్షణ కోసమే ఈ తనిఖీలు చేపట్టామని పోలీసులు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్న సీఐ సురేష్, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## డివైడర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29:**

కందుకూరు పట్టణంలో 5.43 కోట్ల రూపాయలతో జరుగుతున్న డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఇతర అభివృద్ధి పనులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. టిడిపి నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి పామూరు రోడ్డు జంక్షన్ వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పామూరురోడ్డు జంక్షన్ లో ఏర్పాటు చేస్తున్న సర్కిల్ పనులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అక్కడి నుంచి పామూరు బస్టాండ్ వైపు నిర్మించిన డివైడర్, కరెంటు స్తంభాలు, డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలను దగ్గరగా గమనించారు. పనులు త్వర త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు పనులు పూర్తికాగా, డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చెయ్యాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి దివి కొండయ్య చౌదరి విగ్రహం వరకు పనులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ గణపతి, ఏఈ బాలాజీ, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, బెజవాడ ప్రసాద్, కాంట్రాక్టర్ గొంది నర్సింగరావు, షేక్ మున్న, తల్లపనేని రవీంద్ర, మంచిరాజు మురళి, పొడపాటి సుధాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి క్లినిక్ ఏర్పాటు

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**






**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ డిసెంబర్ 29**

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( మీకోసం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ రెవెన్యూ క్లినిక్ లో ప్రత్యేకంగా ఐదు కౌంటర్లు ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం లో ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ సమస్యలపై వస్తున్నాయని, అందువల్ల వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా ఈ రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో రెవెన్యూ సమస్య మూలం కనుగొనడంతోపాటు దానికి వెంటనే పరిష్కారం చూపుతామన్నారు. ముందుగా జిల్లా స్థాయిలో ఒక నెలరోజులపాటు నిర్వహించిన అనంతరం డివిజన్ స్థాయిలో ఈ క్లినిక్ లను నిర్వహిస్తామని తెలిపారు. చివరిగా మండల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు.

**ఇదీ క్రమం... :** రిసెప్షన్ : ముందుగా అర్జీని స్వీకరించేందుకు ఒక రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసిల్దార్ స్థాయి అధికారి ఇందులో ఉంటారు. అర్జీని స్వీకరించి సంబంధిత రెవెన్యూ కౌంటర్ వద్దకు అర్జీదారుని పంపిస్తారు.

కౌంటర్ -1 : ఆర్.ఓ.ఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, రిజర్వు ఫారెస్ట్ భూములకు సంబంధించిన సమస్యలను ఈ టేబుల్ వద్దకు తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

కౌంటర్ -2 : వెబ్ ల్యాండ్ నందు కొత్తగా సర్వేనెంబర్ నమోదు సమస్యలు, భూమి వివరణ మార్పులు,;విస్తీర్ణంలో మార్పుల సమస్యలను ఈ టేబుల్ వద్దకు తీసుకువెళ్తారు.

కౌంటర్ -3 : చుక్కల భూములు, 22(ఏ)(1) తొలగింపు, ఇంటి నివేశన స్థలములు, అసైన్మెంట్ భూముల సమస్యలను ఈ టేబుల్ లోని అధికారులు పరిశీలిస్తారు.

కౌంటర్ - 4 : రీ సర్వే సమస్యలు, జాయింట్ ఎల్పీఎం, ఇతర సర్వే సంబంధిత సమస్యలను పరిశీలించేలా ఈ టేబుల్ ఏర్పాటు చేశారు.

కౌంటర్ - 5 : ఇతర భూసంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే ఈ టేబుల్ వద్దకు తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులతోనూ తహసిల్దార్లు కూడా ఈ క్లినిక్ లో అందుబాటులో ఉంటారు. సంబంధిత ఆర్డీవోలు వీటిని పరిశీలిస్తారు.

## పొదిలి ఎస్.ఐకు నిరసనగా వ్యాపారుల బంద్ విజయవంతం



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 29**

పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వేమనకు వ్యతిరేకంగా పొదిలిలో వ్యాపారులు చేపట్టిన బంద్ విజయవంతం అయింది. పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న వేమన ఇటీవల పొదిలి పట్టణానికి చెందిన వ్యాపారి అవినాష్ తో పాటు అతని తండ్రిపై కూడా దౌర్జన్యం చేయడంతో పాటు కొట్టి గాయపరిచారు. ఎస్ ఐ ప్రవర్తనకు నిరసనగా సోమవారం నాడు పట్టణంలోని వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి బంద్ పాటించడం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో వ్యాపారులు నిరసన ప్రదర్శన చేయడం ద్వారా అధికారులకు వినతి పత్రాలు కూడా అందజేశారు. అనంతరం వ్యాపార సంఘాలకు చెందిన నాయకులు ఎస్ ఐ వేమన కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసేందుకు ఒంగోలుకు తరలి వెళ్లారు.

## మద్యం తాగి తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా, జైలు శిక్ష, లైసెన్సు రద్దు



**గిద్దలూరు పెన్ పవర్ డిసెంబర్ 29**

కంభం మండల పరిధిలో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన ఇద్దరికీ రూ.10 వేలు జరిమానా ఒకరికి 32 రోజులు, మరొకరికి 30 రోజులు జైలు శిక్ష విధిస్తూ గిద్దలూరు కోర్టు తీర్పించింది. అంతేకాకుండా బేస్తవారిపేట మండలంలో మద్యం తాగి వాహనాల నడిపిన ఐదుగురికి న్యాయమూర్తి భరత్ చంద్ర జరిమానా జైలు శిక్ష విధించారు. మద్యం తాగి ద్విచక్ర వాహనలు నడిపిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా ఒకరికి 22, మరొకరికి 13 మూడవ వ్యక్తికి 25, నాలుగవ వ్యక్తికి 23 రోజులు జైలు శిక్ష విధించడంతోపాటు మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్ కి రూ.10వేలు జరిమానా 34 రోజులు జైలు శిక్షతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

## ఎస్సైకు ఎస్పీ అభినందనలు

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 29**

సున్నితమైన కేసులను లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను నాగులుప్పలపాడు ఎస్సై షేక్.రజియా సుల్తానా బేగం కు ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ మేరకు నేర సమీక్షలో ఎస్సైను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

**అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం**






**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29:**

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిటైర్డ్ ఉద్యోగి ఒకరు, సీటులో కూర్చుని దర్జాగా విధులు నిర్వహిస్తుండడాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గమనించారు. ప్రైవేటు వ్యక్తి ఇక్కడ ఎలా పనిచేస్తున్నారు ? ఎవరు పర్మిషన్ ఇచ్చారు ? ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారు ? ఏం తమాషా చేస్తున్నారా ?... అంటూ సబ్ రిజిస్ట్రార్ రామకోటయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ప్రైవేటు వ్యక్తులు లోపలికి వస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ ఫీజు కాకుండా, అదనంగా ఏమైనా డబ్బులు వసూలు చేస్తున్నారా అని అక్కడున్న పలువురిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రశ్నించారు. తమ దగ్గరనుంచి అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బందితో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి దగ్గర అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతిపై ప్రజల నుంచి ఇటీవల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. ఇకనుంచైనా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారిని హెచ్చరించారు.

# శ్రీ సంస్కృతి స్కూల్ లో ప్రముఖ సైకాలజిస్ట్ సంద్రా సుధీర్ కుమార్



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29**

శ్రీ సంస్కృతి స్కూల్ లో సోమవారం ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా హైదరాబాద్ ప్రముఖ సైకాలజిస్ట్ సంద్రా సుధీర్ కుమార్ చే విద్యార్థులకు మోటివేషన్ రూపంలో విద్యార్థుల కెరియర్ గురించి విద్యార్థి దశలో పిల్లలు ఎలా ఉండాలో, తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయుల పట్ల సమాజంలో ఉండే వ్యక్తుల పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో తెలియపరచి విద్యార్థులలో ఒక నమ్మకాన్ని కలిగించారు. అంతేగాక విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసలు కాకుండా విద్యార్థులలో స్ఫూర్తి ని నింపాడు. ఈ సందర్భంగా చైర్మన్ కొంకా చంద్రశేఖర్ విద్యార్థులను ఉద్దేశించి విద్య తో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అందించాలనే ఆలోచనతో హైదరాబాద్ ప్రముఖ సైకాలజిస్ట్ సంద్రా సుధీర్ చే విద్యార్థులలో చదువుతో పాటు జీవిత లక్ష్యాన్ని, మానసిక ధైర్యాన్ని పెంపొందించాలనే ఆలోచనతో, విద్యార్థులకు కెరియర్ గురించిన మెలుకువలు తెలియ పరచాలని నావంతు కృషిగా మా సంస్థలో చదివే విద్యార్థులందరూ అత్యున్నత స్థాయికి ఎదగాలనే ఆలోచనతో ప్రతి సంవత్సరం రెండు సార్లు విద్యార్థులకు మోటివేషన్, క్లాస్ లు ఇప్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరి, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉజ్వల కనెక్షన్ పంపిణీ చేస్తున్న రోడ్డ వెంకట్రావు.

**ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్ల పంపిణీ**

**దొనకొండ డిసెంబర్ 29 పెన్ పవర్**

మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజల కోసం ముఖ్యంగా మహిళలు కట్టెల పొయ్యి ద్వారా వంట వండుకోవటం వల్ల పొగ బారినపడి అనారోగ్యానికి గురవుతున్నారని, ఉజ్వల యోజన కింద దేశంలో పేద ప్రజలందరికీ ఉచితంగా గ్యాస్ స్టవ్ సిలిండర్ పైప్ రెగ్యులేటర్ ఉచితంగా ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా దొనకొండ సాదియా ఇండియన్ గ్యాస్ నందు లబ్ధిదారులైన పోల్ల ఆదిలక్ష్మికి భారతీయ జనతా పార్టీ దొనకొండ మాజీ అధ్యక్షులు రోడ్డ వెంకట్రావు పంపిణీ చేశారు.




# రేపే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**వలేటివారిపాలెం, పెన్ పవర్, డిసెంబర్ 29**



నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1వ తేదీ పంపిణీ చేయాల్సిన ఎన్టీ ఆర్ భరోసా పెన్షన్ ఒక రోజు ముందుగానే రేపు (ఈనెల 31)న పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వై. శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 31వ తేదీ పెన్షన్ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 31న ఉదయం నుంచి పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

## యూ టి ఎఫ్ మార్కాపురం జిల్లా కార్యదర్శిగా డాక్టర్ మొర్రి.పిచ్చయ్య ఏకగ్రీవ ఎన్నిక

**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 29**



ఒంగోలు లోని టి.టి.డి కళ్యాణ మండపంలో నిర్వహించిన 51.వ జిల్లా కౌన్సిల్ సమావేశం లో మార్కాపురం జిల్లా కార్యదర్శిగా కొమరోలు మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లినగరంలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్యను కొమరోలు, రాచర్ల,గిద్దలూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్, జిల్లా కార్యదర్శి మూడు మండలాల జిల్లా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించి పేరు ప్రతిపాదించగా జిల్లా ఎన్నికల కమిటీ అధికారి కొమ్మోజు.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఆమోదించి ప్రకటించారు. వీరు గిద్దలూరు డివిజన్ పరిధిలోని రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల పరిదిలోని ఉపాధ్యాయుల సమస్యలను, సంఘ బలోపేతంకు కృషి చేయవలసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు డివిజన్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి యం.సత్యనారాయణ రెడ్డి, మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొని మార్కాపురం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన యం.పిచ్చయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. తనను ఎన్నుకున్న జిల్లా కౌన్సిలర్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. తన పేరును ప్రతిపాదించిన మూడు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, జిల్లా కార్యదర్శికి, రాష్ట్ర కౌన్సిలర్ కు,సంఘ నాయకులకు, సలహాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## అన్నం పల్లె సర్పంచిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 29**

రాచర్ల మండలం అన్నంపల్లె సర్పంచ్ సిరిగిరి రమేష్ ని వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి కలిశారు. ఇటీవల తనకు రావాల్సిన బిల్లులను ఇవ్వకపోవడంతో రాచర్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద సిరిగిరి రమేష్ కార్యకర్తలతో కలిసి నిరసన తెలుపుతుండగా పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ విషయం పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి దృష్టికి రావడంతో రాచర్ల మండలంలోని అన్నం పల్లె గ్రామానికి వెళ్లి సర్పంచ్ సిరిగిరి రమేష్ ని కలిసి ఆయనకు ధైర్యం చెప్పారు. భయపడవలసిన అవసరం లేదని మాజీ సీఎం జగనన్న ఆదేశాల మేరకు, ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండ గా ఉంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి కార్యకర్తల మీద అన్యాయంగా కేసులు పెడుతూ వారిని వేధిస్తున్నారని. ప్రతి కార్యకర్త పోరాటానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు -మాగుంట

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 29**



జిల్లా ప్రజలు ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉపవాసముండి, విష్ణు భగవానుని భక్తిశ్రద్ధలతో పూజించి, సుభ ఫలితాలు పొంది, సుఖ సంతోషాలతో వుండాలని, ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు బాగుండ శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బాగుండా రాఘవరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ముక్కోటి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మధ్యాహ్న భోజన పథకంపై సంతృప్తిని వ్యక్తం చేసిన ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్





**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, డిసెంబర్ 29**

పట్టణంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. సోమవారం పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి, ఉపాధ్యాయులతో విద్యార్థుల పదవ తరగతి పరీక్షలు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనము చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు

### ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 29**



ఏడాదిలో వచ్చు 24 ఏకాదశులన్నిటిలో ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ప్రాధాన్యత వున్నది. వైకుంట ద్వారాలు తెరుచుకొనే రోజునే అనగా యోగ నిద్ర నుండి లేచిన శ్రీ మహావిష్ణువును ముక్కోటి దేవతలు వైకుంట ద్వార దర్శనం చేసుకునే రోజునే ముక్కోటి ఏకాదశిగా లేక తొలి ఏకాదశిగా ప్రజలు పండుగ చేసుకుంటారు. విష్ణు భగవానుని పూజించిన వారికి మోక్ష ప్రాప్తి కలుగునని పురాణప్రశాస్త్యం నియోజకవర్గ ప్రజలు ముక్కోటి ఏకాదశి పర్వదినాన,, విష్ణు భగవానుని భక్తిశ్రద్ధలతో పూజించి, సుభ ఫలితాలు పొంది, సుఖ సంతోషాలతో వుండాలని కోరుచూ నియోజకవర్గ ప్రజలకు ముక్కోటి ఏకాదశి పండుగ శుభాకాంక్షలను ముత్తుముల అశోక్ రెడ్డి తెలియజేశారు.

## అర్జీలను సత్వరం పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**– ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 399 అర్జీలు**



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 29**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం తో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, కుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతి లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ధరఖాస్తులను పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 399 అర్జీలు రాగా రెవెన్యూ అంశాలపై 146 దరఖాస్తులు రాగా, వివిధ సమస్యలపై 253 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఒక్క ఇసుక రేణువు తరలినా బాధ్యులపై కఠిన చర్యలు

### – అక్రమార్కులకు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు హెచ్చరిక

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 29**





ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఒక్క ఇసుక రేణువు తరలినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలేరు వాగు నుంచి జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి సంబంధిత అధికారులతో సోమవారం ప్రకాశం భవనంలో ఆయన సమీక్షించారు. స్థానిక పరిస్థితులపై కలెక్టర్ ఆరా తీశారు. వాగులు, ఇతర వనరుల్లో లభ్యమయ్యే ఇసుకను కేవలం 500 మీటర్ల పరిధిలోని స్థానిక గ్రామస్తులు మాత్రమే వినియోగించుకునేలా ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. అంతేతప్ప... పాలేరులో ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించడానికి అనుమతి లేదన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటుచేసిన యార్డుల నుంచి మాత్రమే వినియోగదారులు ఇసుకను కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తవ్వినా, రవాణా చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేయాలని చెప్పారు. పాలేరులోని ఇసుకను వాగు ప్రవహిస్తున్న గ్రామాల ప్రజలే వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేసి, ఇసుక అవసరం ఉన్నట్లుగా పంచాయతీ కార్యదర్శి ద్వారా రసీదు తెచ్చుకున్న వారికే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఉచిత ఇసుక పేరుతో అక్రమంగా తవ్వినా, రవాణా చేసినా బాధ్యులపై ఉక్కుపాదం మోపాలని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానంపై స్థానిక ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డిటిసి సుశీల, ఒంగోలు డి.ఎస్.పి. ఆర్. శ్రీనివాసరావు, సంబంధిత మండలాల తహసీల్దారులు, పోలీసు ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం స్క్రీనింగ్ క్యాంపు



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 29**

ప్రకాశం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి ఆధ్వర్యంలో జోనల్ లెవెల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కు ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఆటల పోటీలు స్క్రీనింగ్ క్యాంపు జరిగినది. ఈ ఆటల పోటీల క్యాంపులో బాపట్ల నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సి డబ్ల్యూ ఎస్ ఎన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి 100, 400,800 మీటర్ల పరుగు పందెం లాంగ్ జంప్, షార్ట్ పుట్ క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడాంశాల నుండి 9 మంది సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థులను సెలెక్ట్ చేసి కేంద్ర కార్యాలయానికి పంపడం జరిగినది. ఈ క్రీడాంశాలను మొదటగా 100 మీటర్ల పరుగు పందెంతో మొదలయ్యింది. ఈ పోటీని అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి జెండా ఊపి ప్రారంభించారు. తదనంతరం నిర్వహించిన సభలో అనిల్ కుమార్ దాసరి మాట్లాడుతూ ఇక్కడ పాల్గొన్న క్రీడాకారులందరూ యోధుల్లాంటివారు అనే వీళ్ళందరినీ చూస్తే చాలా సంతోషంగా ఉందనే చెబుతూ వాళ్ళ గెలుపుకై ఏం చేయాలన్న సమగ్ర శిక్ష తరపున చేస్తానని చెప్పారు. వీళ్ళందరినీ అన్ని క్రీడాంశాల్లో ఎంపికై ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కి అక్కడ జెండా పాతి దిగ్విజయంగా వచ్చి మళ్ళీ ఇక్కడ విజయోత్సవ జరుపుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల సహిత విద్య సమన్వయకర్తలు నాగేంద్ర నాయక్, ప్రసాదరావు, జ్యోత్స్న పాల్గొన్నారు. వీరితో పాటు స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఐఆర్పిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని కే శంకర్ సమగ్ర శిక్ష స్పోర్ట్స్ కన్సల్టెంట్ పర్యవేక్షించారు.

## ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

### రాష్ట్ర ఆర్యవైశ్య చైర్మన్ రాకేష్ స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 29**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఎప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర ఆర్యవైశ్య చైర్మన్ నుండి రాకేష్ చెప్పారు. సోమవారం నాడు ఆయన పొదిలికి విచ్చేసి, ఎరువుల వ్యాపారి యాదాల వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు అవినాష్ లను పరామర్శించారు. పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వేమన ఇటీవల యదాల వెంకటేశ్వర్లు అవినాష్లపై దౌర్జన్యం సాగించడంతోపాటు వారిని కొట్టి గాయపరచడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య చైర్మన్ రాకేష్ పొదిలికి విచ్చేసి వారి కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన తమ దృష్టికి రాగానే రాష్ట్ర హోంమంత్రి తో పాటు పలువురు పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని రాకేష్ చెప్పారు. అందువల్లనే పొదిలి పోలీసు ఎస్సై వేమనను వెంటనే విఆర్ కు పంపించడం జరిగిందని ఆయన చెప్పారు. ఏమైనాప్పటికీ అధికారం ఉంది కదా అని పరిధికి మించి ప్రవర్తించడం ఎవరికైనా మంచిది పద్ధతి కాదని రాకేష్ చెప్పారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే పొదిలి ఎస్సై వేమనను విఆర్ కు పంపించడం జరిగిందని రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు స్థానిక శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గునుపూడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలి

### – జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి.. సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 29**

పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశం మీద ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి.. సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం కొత్తపట్నం మండలంలోని పాదర్తి లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని న్యాయమూర్తి సందర్శించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థినీ విద్యార్థులను అధ్యాపకులు, వసతి గృహ సిబ్బంది తమ కుటుంబ సభ్యులు గా చూసుకోవాలని సూచించారు. వివాహ వయో పరిమితిని దృష్టిలో పెట్టుకొని వివాహాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జువ్వనైల్ జస్టిస్ లీగల్ అడ్వైజర్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర సహాయం కొరకు 1098, 100 కు ఫోన్ చేయడం గురించి అవగాహన కలుగజేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29**

పట్టణంలోని 31, 32 వార్డు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు టిడిపి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఆంధ్రప్రదేశ్ విద్యా మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, 31 వ వార్డు టిడిపి అధ్యక్షుడు అత్తంటి శివకృష్ణ, 32వ వార్డు టిడిపి అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ, పార్టీ నాయకులు బెజవాడ ప్రసాద్, ముప్పవరపు వేణు, గుర్రం మధు, భవనాసి వెంకటేశ్వర్లు, నల్లమోతు రవీంద్రబాబు, గుమ్మా శివ, నాదెండ్ల మధు, పులి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే పదవులు ఖాయం

### ఇదే తెలుగుదేశం సిద్ధాంతం –టిడిపి పార్లమెంటరీ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు

### శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు








**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 29**

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటరీ కమిటీకి కందుకూరు నియోజకవర్గం నుంచి ఇటీవల నియమితులైన సభ్యులు, శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవులు రావడానికి సహకరించిన ఎమ్మెల్యేకు వారంతా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా (రూబీ) లు ఎమ్మెల్యే ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక్కొక్కరికి స్వీట్ తినిపించి, శాలువాతో సత్కరించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని, పదవులు వాటంతటవే వస్తాయని అన్నారు. పదవులు పొందిన వారంతా పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తూ... మరెన్నో ఉన్నత పదవులు పొందేలా కష్టపడాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు పార్టీలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల





**కొనకనమిట్ల పెన్ పవర్ డిసెంబర్ 29**
రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.గార్లదిన్నె గ్రామంలో నిర్వహించిన 'రైతున్న మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు పథకాలు,సాగునీటి సదుపాయాలు, పంటల బీమా తదితర అంశాలపై ఆయన వివరించారు.రైతుల ఆదాయం పెంపు,వ్యవసాయ రంగ బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.ఈ నిర్ణయంతో మార్కాపురం ప్రాంత ప్రజలకు పరిపాలనా సౌలభ్యాలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఇది ఈ ప్రాంత అభివృద్ధికి ముందడుగుగా నిలుస్తుందని అన్నారు.మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించిన సందర్భంగా మహిళలు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.

**30 కుటుంబాలు టీడీపీలో చేరిక**

గార్లదిన్నె గ్రామంలో కూటమి ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతోంది.గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి.వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీ విధానాలు,నాయకత్వంపై నమ్మకంతోనే తాము టీడీపి పార్టీలో చేరుతున్నామని వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఈశ్వరమ్మ ,ఏఓ ప్రకాష్ రావు,ఏపిఓ బుల్లెన రావు,ఏపిఎం సుధాకర్,టీడీపీ నాయకులు బాబురావు,భాషాపతి నాయుడు, భీమాంజనేయ రెడ్డి,సుబ్బయ్య,సుఖదేవ్ పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడపల్లి ధర్మకర్త మండల సభ్యురాలుగా పెండెం కుమారి ప్రమాణస్వీకారం

* ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపిన పెండేం దంపతులు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 29:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి నూతనంగా ధర్మకర్త మండలి సభ్యురాలిగా నియమితులైన పెండేం కుమారి వెంకన్న దంపతులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.వాడపల్లి ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన ధర్మకర్త మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ఆమె మాట్లాడుతూ, తనకు ఈ పవిత్ర క్షేత్రంలో సేవ చేసే అవకాశం కలగడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. భక్తి భావంతో భక్తులకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఆమె స్పష్టం చేశారు.వాడపల్లి వెంకటేశ్వర స్వామి కృపతో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆశీస్సులు, ప్రోత్సాహంతో ఈ బాధ్యత లభించిందని పేర్కొన్న పెండేం కుమారి, ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల పెంపు కోసం పాలకమండలితో కలిసి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ధర్మకర్త మండలికి శుభాకాంక్షలు తెలిపారు.

## హైస్కులు అభివృద్ధి కి 50.000 విరాళం....

* లోటాస్ ఎన్ క్లేవ్ ప్రతినిధి లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబరు 29.**తాడేపల్లిగూడెం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ స్థానిక శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ చేతులు మీదుగా లోటాస్ ఎన్ క్లేవ్ సంస్థ తరుపున రు 50.000/ విరాళం అందిచిన సి ఇ ఓ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు. అభివృద్ధి కు చేయూత నివ్వడం అభినందనీయం ప్రజల భాగస్వామ్యం తో హైస్కులు మరింత అభివృద్ధి చెందుతుంది అని దాత భూపతిరాజు శివాజీ కు అభినందనలు అని చీఫ్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు
అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నార్నివెంకటసత్యనారాయణమాట్లాడుతూ ప్రజా ఉపయోగార్థం నిర్మాణం అవుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్న దాతలు కు ఈరోజు విరాళం అందించిన లోటాస్ ఎన్ క్లేవ్ సంస్థ యాజమాన్యం భూపతి రాజు శివాజీరాజుసాగిసీతారామరాజు.సంస్థ ప్రతినిది పేరిచర్ల మురళీ కృష్ణంరాజు లకు కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు..లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ హైస్కులు అభివృద్ధి కి పూర్వ పు విద్యార్థుల సహకారం అందించాలని భావి తరాలకు విద్యార్థుల కు యువత కు ఉపయోగపడేలాజరుగుతున్న అభివృద్ధి పనులు అందరికి ఆమోద యోగ్యం గా ఉన్నాయనిదాతలుముందుకు వచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో నాయకులు జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ. డైమండ్స్ లయన్స్ క్లబ్ వైస్ ప్రసిడెంట్ లయన్ కాళ్ళ గోపికృష్ణ పైబోయిన వెంకట్రామయ్య నకెళ్ళ తాతాజీ లయన్ ఎస్ వి ఎస్ సత్తిబాబు లయన్ తమ్మాబత్తులసత్యనారాయణ అడబాలమురళీ.ఆచంట ప్రసాద్.సుంకర గంగాధర్. గాజుల మురళీ కృష్ణ మాజీ కౌన్సిలర్లు గొర్ల మహారాజు యలమంచిలి శ్రీనివాస్ తాళ్ల నాగబాబు చెల్లా సత్తిబాబు
మణి కుమార్ విష్ణు కుమార్ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాలు, అరాచక శక్తులపై ఉక్కుపాదం

– ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

– డయల్ 112, శక్తీ యాప్ వ్యవస్థను పటిష్ట పరిచి ఆపద వచ్చిందంటే వెనువెంటనే సహాయం అందేలా కృషి

– జిల్లా పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ









**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 29**
జిల్లాలోని పోలీసు అధికారులతో ఒంగోలు సమీపంలోని రైజ్ కాలేజీలో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, 7వ అదనపు జిల్లా.. సెషన్స్ కోర్ట్ జడ్జి టి.రాజా వెంకటాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2025 వ సంవత్సరానికి సంబంధించి జనవరి నుండి డిసెంబర్ నెల వరకు జిల్లా వ్యాప్తంగా నమోదు కాబడిన దొంగతనాలు, దోపిడీ, ఆస్తి నేరాలు, చీటింగ్, పోక్సో, మహిళా సంబంధిత నేరాలు, మిస్సింగ్ కేసులు, ఎస్సి %ఇ% ఎస్టి యాక్ట్ కేసులు, ఎన్డిపిఎస్ యాక్ట్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, మోటార్ వెహికల్ యాక్ట్ కేసులు, ఓపెన్ డ్రింకింగ్ వంటి మొదలగు కేసులపై జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణపై దృష్టి పెట్టడంతో పాటు కేసులను సత్వరం దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కేసులలో ప్రజలకు సత్వరమే న్యాయం జరిగేలా సంబంధిత చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. పైకి సివిల్ వివాదాలుగా కనిపిస్తున్నప్పటికీ నేరాలకు ఆస్కారం ఉన్న కేసులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు మరింత దృష్టి సారించి,భాదితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గారు సూచించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, మాట్లాడుతూ నేరాల తీరును విశ్లేషించడం ద్వారా, నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని, మరింత సమర్థవంతంగా పని చేస్తూ ముందడుగు వేయాలని సూచించారు. సాంకేతికత ఆధారిత పోలీసింగ్ తో జిల్లాలో నేరాలు గణనీయంగా కొంత వరకు తగ్గాయన్నారు. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అదేవిధంగా జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాను;నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఇతర శాఖల జిల్లా ఉన్నతాధికారులను సమన్వయ చేసుకుంటూ పని చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకుంటూ, ప్రతి ఒక్క పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేసి, జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలని తెలిపారు.

2024సంవత్సరంలోని కేసులు నమోదు 2025 తో పోలిస్తే తక్కువ కేసులు నమోదు. శారీరిక నేరాలు, ప్రాపర్టీ నేరాలు, క్రైమ్ ఎగైనెస్ట్ వుమన్, రోడ్ ఆక్సిడెంట్, యుఐ కేసులు 2024తో పోలిస్తే 2025 లో తక్కువ కేసులు నమోదు. డయల్ 112 వెంటనే స్పందించటం జరిగింది. సమీక్షా కాలంలో నేరాలు తగ్గగా, ప్రజలను సైబర్ నేరాల బారిన పడకుండా, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. జిల్లాలో గంజాయిపై నిఘా పెంచడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలకు పోలీసింగ్ ను మరింత చేరువ చేసేందుకు 'పల్లె నిద్ర'%తత%కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయడం ద్వారా జరగబోయే నేరాలను జరగకుండా చూడవచ్చన్నారు.

జిల్లాలోని పోలీస్ అధికారులకు ఒంగోలు 7వ అదనపు జిల్లా.. సెషన్స్ కోర్ట్ జడ్జి టి. రాజా వెంకటాద్రి కొత్త చట్టాలు గురించి, సైబర్ నేరాలు, ప్రాపర్టీ నేరాలలో సాక్షాలను ఏ విధంగా సేకరించటం, రిలేటింగ్ టు ఇన్వెస్టిగేషన్ గురించి, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరణ గురించి, కేసును ఏవిధంగా నమోదు చేయాలి, నిందితులకు శిక్షలు పడేవిధంగా పలు విషయాలపై అవగాహనా కల్పించి వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎల్లప్పుడు గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.కీలక కేసులు త్వరితగతిన ఛేదించడం, ముఖ్యమైన కేసులలో శిక్షలు పడ్డటం, పెండింగులో ఉన్న కేసులను తగ్గించడం, వార్షిక ఫైరింగ్ లో ప్రతిభ కనపర్చిన, తదితర విధులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, పిపి ,ఏపిపి లను, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను, రివార్డ్స్ జిల్లా ఎస్పీ అందచేశారు.

ఈ నేర సమీక్ష సమావేశంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్,డిటిసి డిఎస్పీ జి.గురునాథబాబు, ఏఆర్ డిఎస్పీకె. శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై. ప్రశాంతి కుమారి, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.అజయ్ కుమార్, కనిగిరి ఏజెసిజె కోర్ట్, ఏపిపి, ఎస్.రఘునాథ రావు, ఒంగోలు ఎక్సైజ్ కోర్టు ఏపిపి కె.శ్రావణ్ కుమార్, స్పెషల్ పిపి లు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, జిల్లాలోని అడిషనల్ పిపిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## తైక్వోండో కలర్ గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్



**అంబాజీపేట, పెన్ పవర్, డిసెంబరు 29:** డా. బి. ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా వ్యాప్తంగా తైక్వోండో కలర్ గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వోండో అసోసియేషన్ సెక్రెటరీ, ఒలింపిక్ రిఫరీ బి. అర్జున రావు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. రాజోలు, ఇరుసుమండ, అమలాపురం, పి గన్నవరం, అంబాజీపేట నుండి 120 మంది విద్యార్థులు పాల్గున్నారు. ఈ బెల్ట్ టెస్ట్ లో వైట్, ఎల్లో, ఎల్లో-1, గ్రీన్, గ్రీన్- 1, బ్లూ, బ్లూ- 1, రెడ్, రెడ్-1, బెల్ట్ లకు సంబంధించి టెస్ట్ లు నిర్వహించారు. అనంతరం ఎంకైన క్రీడాకారులకు బెల్ట్ లను అందచేశారు.
ఈ కార్యక్రమంలో కోచ్ లు సత్యసనారాయణ (కాకినాడ), భార్గవి, భూషణం, ఖుషివీర్, మణికుమార్, రాజశేఖర్ పాల్గున్నారని డా.బి ఆర్ అంబెద్కర్ కోనసీమజిల్లా తైక్వోండో సెక్రటరీ పితాని త్రిమూర్తులు తెలిపారు.

## నాడు అసౌకర్యాలతో క్షోభ..నేడు వారపు సంతకు శోభ




**ఏలూరు డిసెంబర్ 29 పెన్‌పవర్** :కొన్నేళ్లుగా భీమడోలు మండల కేంద్రంలో జరిగే వారపు సంతలో వినియెగదారులు,రైతులు సౌకర్యాల లేమితో ఎండకు ఎండుతూ,వానలకు తడుస్తూ బురద కాళ్లతో సంతలో తిరిగేవాళ్లు .ఇబ్బందులు పడేవారు.భీమడోలు సర్పంచ్‌గా పాము సునీతా మాన్‌సింగ్‌ను గెలిపించుకున్నారు. ఆమె నియోజక వర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు సహకారంతో నాబార్డు నిధులు మంజూరు చేయించి ఆ నిధులతో భీమడోలు సంతమార్కెట్‌ను అభివృద్ధి చేశారు.మార్కెట్‌లో వ్యాపారులకు,షెడ్లు,రోడ్‌లు,నిర్మించి కూటమి పార్టీల నాయకులందరిని కలుపుకుని సంత మార్కెట్‌ను అభివృద్ధి చేసినట్లు పాము సునీతమాన్‌సింగ్ తెలిపారు.ఒకప్పుడు అసౌకర్యాల ఇబ్బందులతో ఇక్కట్లు ఎదుర్కొన్న వారపుసంత వచ్చే రైతులు నేడు వారపు సంతకు శోభవచ్చిందని ,వారపు సంతను నిధులు కేటాయించి,అభివృది చేసిన ఉంగుటూరు శాశనసభ్యులు పత్సమట్లధర్మరాజును,పంచాయితీ సర్పంచ్ పాముసునీతా మాన్‌సింగ్ పాలకవర్గం సభ్యులను,పంచాయితీ సిబ్బందిని రైతులు,గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

## జగ్గంపేట అన్న క్యాంటీన్ లో పేదలకు ఉచిత అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 29:** స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో గత నాలుగున్నర సంవత్సరాలుగా దాతల సహకారంతో ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన కీర్తిశేషులు జామి రాంబాబు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, కొత్త కొండబాబు, రేఖ బుల్లి రాజు, వేములకొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, బద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయ లియో క్లబ్ కు బెస్ట్ లియో క్లబ్ అవార్డ్



**గండేపల్లి, పెన్ పవర్, డిసెంబర్, 29:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316దీ, రీజియన్×ఎ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆదిత్య విశ్వవిద్యాలయ లియో క్లబ్ విశేష ఘనత సాధించింది అని డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీ నివాస రెడ్డి తెలిపారు. కాకినాడ లో నిర్వహించిన సదస్సులో ఆదిత్య సూరంపాలెంకు "బెస్ట్ లియో క్లబ్" అవార్డు ప్రదానం చేయగా, అదే క్లబ్‌కు మార్గదర్శకత్వం వహిస్తున్న ప్రొఫెసర్ నులు నరేష్ కి "బెస్ట్ లియో అడ్వైజర్" అవార్డు లభించింది అని తెలిపారు. లియో క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, గ్రామీణ అభివృద్ధి చర్యలు, యువతలో సేవాభావాన్ని పెంపొందించడంలో లియో క్లబ్ ఆదిత్య సూరంపాలెం చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డులు అందజేశారు. ముఖ్యంగా బాల్యవివాహేల నిర్మూలన, అవగాహన ర్యాలీలు, సేవా కార్యక్రమాలలో క్లబ్ చురుకైన పాత్ర పోషించింది.
ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న సభ్యులు మాట్లాడుతూ, ఈ గౌరవం తమ సేవా ప్రయాణానికి మరింత ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. ఆదిత్య విశ్వవిద్యాలయ లియో క్లబ్ సాధించిన ఈ అవార్డు విద్యాసంస్థకు, విద్యార్థులకు గర్వకారణంగా నిలిచింది అని ప్రో.వైస్ చాన్సలర్ డా. ఎ.రమేష్ అభినందనలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో డీన్.డా.డి.కిషోర్ తదితరులు పాల్గొని లియో క్లబ్ సభ్యులకు అభినందనలు తెలియజేసారు.

# చేసింది చాలు.. ముందు రంజీ ట్రోఫీకి కోచ్‌గా పనిచేయండి..

## గంభీర్‌పై సీనియర్ క్రికెటర్ షాకింగ్ కామెంట్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టులో ప్రయోగాలు శృతిమించాయన్న విమర్శల ఇటు స్వదేశంలోనూ.. అటూ విదేశాల నుంచి కూడా పెరుగుతూనే ఉన్నాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, గంభీర్ కలిసి టీమిండియాను క్రికెట్ ల్యాబ్‌గా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ప్లానింగ్‌తో కూడిన మార్పులు కాకుండా, అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలు జట్టును దెబ్బతీస్తున్నాయని ఇప్పటికే చాలా మంది విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ క్రమంలో గంభీర్ పై సీనియర్ ప్లేయర్ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి.

గౌతమ్ గంభీర్ ఇప్పటి వరకు చేసింది చాలు.. ఇక నుంచి రంజీ ట్రోఫీకి కోచ్ గా వ్యవహరిస్తే బాగుంటుంది. రెడ్ బాల్ క్రికెట్ గురించి తెలుసుకోవాలంటే రంజీ చాలా ఉపయోగపడుతుందని సలహా ఇచ్చారు ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్. గంభీర్ వైట్ బాల్ క్రికెట్ లో సక్సెస్ ఫుల్ అయ్యారు కానీ.. రెడ్ బాల్ క్రికెట్ అర్థం చేసుకోవటంలో విఫలమయ్యారు. అందుకోసం రంజీ కోచ్ గా చేస్తే బాగుంటుంది. అక్కడ ఇతర కోచ్ ల తో కలిసి టీమ్ జట్టు కూర్పు ఎలా చేయాలో నేర్చుకోవచ్చునని సలహా ఇచ్చారు. ఇక్కడ చేసింది చాలు.. ఇక రంజీ కోచ్ గా పనిచేయడం మంచిది అనే అర్థంలో షాకింగ్ కామెంట్స్ చేశారు పనేసర్. టెస్టులకు హెడ్ కోచ్ గా ఎవీయా లక్ష్మణ్ ను తీసుకునేందుకు బీసీసీఐ ఆలోచిస్తోందని.. ఈ విషయంలో లక్ష్మణ్ ను సంప్రదించినట్లు వార్తలు వస్తున్న క్రమంలో పనేసర్ చేసిన కామెంట్స్ ప్రాధాన్యత తంతరించుకున్నాయి. ఇండియా ఇటీవల టెస్ట్ సిరీస్ లలో చాలా దారుణంగా ఫెయిల్ అయింది. సౌతాఫ్రికాపై సొంత గడ్డపైన కూడా దారుణంగా ఓడిపోవడంతో కోచ్ గంభీర్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కెప్టెన్ శుభ్మన్ గిల్ పై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు పనేసర్. గిల్ ట్యాలెంటెడ్ ప్లేయర్ అయినప్పటికీ.. అన్ని ఫార్మాట్ లను లీడ్ చేసేంత కాదని అన్నాడు. కోచ్ గంభీర్ ఆధ్వర్యంలో గిల్ కెప్టెన్సీలో టెస్ట్ క్రికెట్ లో ఇండియా రెండు వైట్ వాష్ లను మూటగట్టుకుంది. న్యూజీలాండ్ పై 3-0, సౌతాఫ్రికాపై 2-0 తో రెండు వైట్ వాష్ లకు గురికావడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో గంభీర్ రంజీ కెప్టెన్ గా వ్యవహరించడం ఉత్తమమని పనేసర్ కామెంట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

# ఒకే మ్యాచ్‌లో 8 వికెట్లు.. ప్రపంచ రికార్డు సృష్టించిన యంగ్ స్పిన్నర్ !




**హైదరాబాద్ పెన్ పవర్:** మట్టిలో మాణిక్యాలు అంటారు కదా.. వరల్డ్ క్రికెట్లోకి అలాంటి ప్లేయర్లు అప్పుడప్పుడు ఎంట్రీ ఇస్తుంటారు. చరిత్రను తిరగరాస్తుంటారు. ఈ ప్లేయర్ కూడా అలాంటోడే. ఒకే ఇన్నింగ్స్ లో.. ఒకే మ్యాచ్ లో 8 వికెట్లు తీయటం మామూలు విషయమా. ఇప్పటి వరకు ఎవరూ అందుకోలేని ఫీట్ ను సాధించి ట్రెండ్ సెట్టర్ గా నిలిచాడు సోనమ్ యెషీ. సోషల్ మీడియాలో ఎవరీ సోనమ్ అంటూ ఫుల్లుగా వెతుకుతున్నారు క్రికెట్ అభిమానులు. భూటాన్ కు చెందిన ప్లేయర్ సోనమ్ యెషీ ఇంటర్నేషనల్ టీ20 చరిత్రలో అరుదైన రికార్డును తనఖాతాలో వేసుకున్నాడు. టీ20లో ఒకే మ్యాచ్ లో 8 వికెట్లు తీసిన మొదటి బౌలర్ గా రికార్డు సృష్టించాడు. గెలెపు లో జరిగిన మ్యాచ్ లో మయన్మార్ పై 8 వికెట్లు తీసి చరిత్రను తిరగరాశాడు. ఈ ఇన్నింగ్స్ లో సోనమ్ 4178 తో అద్భుత బౌలర్ గా ప్రపంచం దృష్టిని ఆకర్శించాడు. ఫస్ట్ బ్యాటింగ్ ఆడిన భూటాన్ 127 రన్స్ చేసి.. గెలుపు భారం యెషే పైన వేసింది. టీమ్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జట్టును ఆదుకోవడమే కాదు.. మయన్మ్ బ్యాటింగ్ లైనప్ ను కుప్పకూల్చేశాడు. 3వ ఓవర్ లో ఫస్ట్ బాల్ కే పైయే ఫియో వై ను పెవిలియన్ కు పంపి.. భూటన్ లో ఆశలు కల్పించాడు. ఆ తర్వాత అదే ఓవర్ లో కోకో లిన్, కెప్టెన్ టెట్ అం గ్ లను కూడా పెవిలియన్ కు పంపించేశాడు. వరుసగా వికెట్లు తీస్తుండటంతో డిఫెండ్ చేసుకుందామనుకున్నా.. 9.2 ఓవర్లకు 45రన్స్ మాత్రమే చేయగలిగారు. యెషీ కి ముందు.. 7 వికెట్లు తీయడం అనేది టాప్ సీలింగ్. కొద్ది మంది మాత్రమే ప్రొఫెషనల్ టీ20 క్రికెట్ (అంటే ఇంటర్నేషనల్, స్థానిక, ఫ్రాంచైజ్ లలో ఆడిన కొందరు మాత్రమే7 వికెట్లు సాధించారు.

# రూ.1,500 నుంచి రూ.7 కోట్లు.. భారత క్రికెట్‌లో ఇంత మార్పా?

**పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవనే దానికి ప్రత్యక్ష ఉదాహరణ భారత క్రికెట్. ఒకప్పుడు క్రికెటర్లు ఉద్యోగాలు చేస్తూనే మ్యాచులు ఆడిన రోజులను చూశాం. ఇప్పుడు ఒక్కసారి జాతీయస్థాయిలో పేరు తెచ్చుకుంటే కాసుల వర్షమే. ఈ సమూల మార్పుల వెనక ఎన్నో కష్టనష్టాలు, ధైర్యవంతమైన నిర్ణయాలు ఉన్నాయనేది కాదనలేని వాస్తవం. మరి టీమ్‌ఇండియా 'ప్రగతి'పై ఓ లుక్కేద్దాం.**




**హైదరాబాద్ పెన్ పవర్:** మూడు దశాబ్దాలకు ముందు.. భారత జట్టు తరపున క్రికెట్ ఆడటం గొప్ప గౌరవం. ఇప్పటికీ అలానే ఉన్నా.. అప్పుడు ఆదాయం అంతంతమాత్రమే. అయినా సరే.. ఆటపై ఉన్న ప్యాషన్‌తో బరిలోకి దిగేవారు. ఓ వైపు క్రికెట్ ఆడుతూనే 9-5 ఉద్యోగాలు చేసిన 'స్టార్లూ' ఉన్నారంటే అతిశయోక్తి కాదు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లాడు ఏ డాక్టరో, ఇంజినీరో అయి నాలుగు రాళ్లు సంపాదించుకుంటే చాలని ఆశించేవారు. క్రికెటర్‌గా మారతామంటే కాస్త సంశయం వ్యక్తం చేసేవారు. కానీ, నేటితరం ఆలోచనలు పూర్తిగా మారిపోయాయి. తమ పిల్లలను చిన్నప్పటి నుంచే క్రికెటర్‌గా మార్చేందుకు ప్రస్తుత జనరేషన్ తల్లిదండ్రులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారంటే భారత క్రికెట్ రూపురేఖలు ఏ స్థాయికి చేరుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు బ్లూచిప్ కంపెనీల్లో ఉద్యోగం సంపాదించి ఐదంకెల జీతం అందుకోవాలని కలలు కనే కుర్రాళ్లు.. 'బ్లూ జెర్సీ' ధరించాలనే లక్ష్యంతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం గమనార్హం.

### ఆ గౌరవం వేరు.. ఆ ఆదాయం వేరు

భారత క్రికెట్ అభిమానులకు 1983 వన్డే ప్రపంచ కప్‌ను కపిల్ దేవ్ 'లార్డ్స్'లో ఎత్తుకున్న ఫొటో ఎప్పటికీ గుర్తుంటుంది. కానీ, ఆ రోజుల్లో టీమ్‌ఇండియా ఆటగాళ్లు అందుకొన్న మొత్తాలను చూస్తే ఎవరైనా ఆశ్చర్యపడాల్సిందే. కపిల్, గావస్కర్ రోజుల్లో ఒక్కో మ్యాచ్‌కు ఫీజుగా రూ.1,500తోపాటు రోజువారీ భత్యం రూ.200 చొప్పున వచ్చేది. అప్పటికి బీసీసీఐ వద్ద ఎలాంటి ఫండ్స్ ఉండేవి కావు. 1983లో భారత క్రికెటర్లకు ఇచ్చిన పేమెంట్‌పై సోషల్ మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన షీట్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కుటుంబపోషణ కోసం బ్యాంకులు, రైల్వేస్, పబ్లిక్ సెక్టార్‌లో 'స్పోర్ట్స్' కోటాలో పని చేసేవారు. కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. క్రికెట్ దిగ్గజం గావస్కర్ ఓసారి స్పందిస్తూ 'మేం ఎప్పుడైనా టెస్టు క్రికెట్ మ్యాచ్ సరిగా ఆడకపోతే జట్టులో అవకాశం వచ్చేది కాదు. అప్పుడు 9-5 జాబ్‌కు వెళ్లిపోయేవాళ్లం' అని పేర్కొన్నారు.

### అక్కడినుంచే మార్పు..


1990ల్లో భారత్ ఆడే మ్యాచులను ప్రభుత్వ రంగ సంస్థ దూరదర్శన్ మాత్రమే ప్రసారం చేసేది. అదీనూ బీసీసీఐ అక్కడ తమ స్లాట్‌లను బుక్ చేసుకొని మరీ బ్రాడ్‌కాస్ట్ చేయాల్సి వచ్చేది. అంటే బోర్డే ఎదురు డబ్బు ఇచ్చి మ్యాచ్‌లను ప్రజలకు చూపించేది. క్రికెట్‌ను ప్రమోట్ చేయడానికి అలా చేయాల్సి వచ్చేది. ఎప్పుడైతే జగ్‌మోహన్ దాల్మియా బీసీసీఐ అధ్యక్షుడిగా వచ్చారో సమూల మార్పులు చేశారు. బోర్డు అంటే బెగ్గర్ కాదు.. దేశానికి ఎంతో విలువైన కంటెంట్ ఇస్తోన్న యజమాని అని నిరూపించారు. 1993లో భారత్ - ఇంగ్లాండ్ సిరీస్ ప్రసార హక్కులను ట్రాన్స్‌వరల్డ్ ఇంటర్నేషనల్ అనే సంస్థకు 5.50 లక్షల డాలర్లకు విక్రయించారు. అప్పట్నుంచే భారత క్రికెట్ హవా మొదలైంది. ఇక 2000 నాటికి భారత మ్యాచుల ప్రసార హక్కుల విక్రయంతో బిలియన్ డాలర్లను బోర్డు ఆర్జించింది.


### సెంట్రల్ కాంట్రాక్ట్‌ల ఆలోచన..

రెండు దశాబ్దాల ముందు వరకు ఆటగాళ్లకు నిలకడైన ఆదాయం ఉండేది కాదు. మ్యాచ్ ఆడితే ఫీజు, భత్యం రూపంలోనే కాస్త సంపాదన ఉండేది. కానీ, 2004లో బీసీసీఐ ప్లేయర్ల కోసం 'సెంట్రల్ కాంట్రాక్ట్' విధానాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా ఆటపై మరింత దృష్టి పెట్టేందుకు ఆటగాళ్లకు వెసులుబాటు దక్కింది. తొలుత రూ.50 లక్షలు, రూ.30 లక్షలు, రూ.20 లక్షలతో ప్రారంభమైన ఈ విధానం.. ఇప్పుడు సెంట్రల్ కాంట్రాక్ట్ క్రికెటర్‌కు కనీసం రూ. కోటికి చేరుకుంది. ఇక టాప్ గ్రేడ్ ‍ా+లో ఉంటే ఏకంగా రూ.7 కోట్లను దక్కించుకోవచ్చు. వీటికి మ్యాచు ఫీజులు అదనం. అవి కూడా తక్కువేం కాదు. ప్రస్తుతం ఒక్కో టెస్టు మ్యాచ్‌కు రూ. 15 లక్షలు (2004లో రూ.2లక్షలు), వన్డేకు రూ.6 లక్షలు, టీ20 మ్యాచ్‌కు రూ.3 లక్షల చొప్పున ఫీజు దక్కనుంది. ఇక దేశవాళీలోనూ కుర్రాళ్లు కూడా కనీసం రూ.17 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ అందుకోవడం విశేషం. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే యువతరానికి కెరీర్‌పై నమ్మకం ఇచ్చినట్లైంది. ఐపీఎల్ ఎంట్రీ (2008)తో భారత క్రికెట్‌కు జోష్ తెచ్చింది. ప్లేయర్లకు కాసుల వర్షం కురిపించింది. ఇక బీసీసీఐ కార్యదర్శిగా జైషా వచ్చాక.. టెస్టు క్రికెట్‌తోపాటు మహిళా క్రికెటర్లను ప్రోత్సహించిన తీరు ఇక్కడ ప్రస్తావించాల్సిందే. ఇప్పుడు వారు కూడా పురుష క్రికెటర్లతో సమంగా భత్యాలను అందుకోగలుగుతున్నారు.

**చివరిగా:** మొన్నటివరకు మా పిల్లాడు పెద్ద జాబ్ చేస్తే చాలనుకొనే తల్లిదండ్రులు.. ఇప్పుడు క్రికెట్‌నూ కెరీర్‌గా ఎంచుకోవాలని ఆశిస్తున్నారు. అభిమానుల్లో ఉండే క్రేజ్ మాత్రమే కాకుండా.. ఆర్జనలోనూ ఉత్తమంగా మారింది. ఇప్పుడంతా వైభవ్ సూర్యవంశీని ఆదర్శంగా తీసుకొనేవారు లేకపోలేదు. సచిన్ 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వగా.. 14 ఏళ్ల వయసులోనే వైభవ్ తన ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. మున్ముందు ఇలాంటి కుర్రాళ్లు మరింతమంది రావాలని ఆకాంక్షిస్తూ.. హ్యాపీ న్యూఇయర్ టు 2026..

# రోషన్ తండ్రిని మించిన తనయుడు అవుతాడా?







పుత్రుడు జనియించినప్పుడు కాదు ఆ పుత్రుడు తండ్రి పేరు నిలబెట్టినప్పుడే ఆ తండ్రి ధన్యుడు అవుతాడు. సాధారణంగా తల్లిదండ్రులు ఏ రంగంలో అయితే సెటిల్ అవుతారో.. అదే రంగంలో తమ పిల్లల్ని కూడా సెటిల్ చేయాలని ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అందులో భాగంగానే సినీ రంగం గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సినీ ఇండస్ట్రీలో హీరోలు, హీరోయిన్లు తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్న తర్వాత తమ వారసులకు కూడా అదే స్థాయిని కల్పించాలని చూస్తూ ఉంటారు. అలా తల్లిదండ్రుల వారసత్వంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సెలబ్రిటీలు కొంతమంది తల్లిదండ్రులతో సమానంగా గుర్తింపును సంపాదించుకుంటే.. మరికొంతమంది తల్లిదండ్రులకు మించిన పాపులారిటీ అందుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ఉదాహరణకు రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్ బాబు లాంటి హీరోల పేర్లు ప్రథమంగా వినిపిస్తూ ఉంటాయి. తల్లిదండ్రులకు మించిన పాపులారిటీని సొంతం చేసుకొని ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అలా ఇప్పుడు సినీ బ్యాక్ గ్రౌండ్ తో ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్న కొత్త హీరోలు కూడా ఈ హీరోలను చూసి తమ తల్లిదండ్రులకు మించిన క్రేజ్ దక్కించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిలో సీనియర్ స్టార్ హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ ను మొదలుపెట్టిన రోషన్ రుద్రమదేవిలో తొలిసారి కనిపించి ఆ తర్వాత నిర్మల కాన్వెంట్ సినిమాలో లీడ్ రోల్ పోషించి ఆకట్టుకున్నారు.

ఆ తర్వాత తన తండ్రి శ్రీకాంత్ 1996లో నటించిన పెళ్లి సందడికి ఆధ్యాత్మిక సీక్వెల్ అయిన పెళ్లి సంద%ణ% మూవీను 2021లో చేసి హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఇక నాలుగేళ్ల గ్యాప్ తీసుకొని ఇప్పుడు ఛాంపియన్ అంటూ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమా మంచి విజయం అందుకుంది . ఈ సినిమా సక్సెస్ తో అప్పుడే బడా నిర్మాణ సంస్థ గీత ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ రోషన్ మేకకు తన బ్యానర్ లో సినిమా చేసే అవకాశాన్ని కల్పించారు. ఇక దీన్ని బట్టి చూస్తే ఒక్క సినిమా ఈయనకు భారీ విజయాన్ని అందించడమే కాకుండా వరుస అవకాశాలు అందిస్తోంది అనే కామెంట్లు కూడా వ్యక్తం అవుతున్నాయి. అంతేకాదు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో కూడా మరో ప్రాజెక్టు ఓకే అయింది. ఇలా వరుసగా అగ్ర నిర్మాణ సంస్థలతో అవకాశం రావడంతో టాలీవుడ్ లో రోషన్ క్రేజ్ మరింత పెరిగిపోయిందని చెప్పాలి. ఇకపోతే విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్న రోషన్ ఈ బ్యానర్లలో సినిమాలు చేసి సక్సెస్ అందుకున్నారంటే ఖచ్చితంగా మరిన్ని బడా ప్రాజెక్టులు ఈయన తలుపు తడతాయి. ఒకవేళ అవన్నీ కూడా కలిసొచ్చాయి అంటే తండ్రి శ్రీకాంత్ ను మించిన తనయుడు అవుతాడు అనడంలో సందేహం లేదు అంటూ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. మరి ఈ మాటను రోషన్ నిలబెట్టుకుంటారో లేదో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com